ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 22.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:25 (బుధ)
సహరి : 4:40 (గురు)

కోడ్ ఉల్లంఘన.. ఉపాధ్యాయుడి సస్పెన్షన్

చింతలపూడి, మార్చి 26 : చింతలపూడి మండలం కంచెనగూడెం పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయుడు కె.చెంచంరాజు ఎన్నికల కోడ్ ఉల్లంఘించడంతో మంగళవారం డీఈవో ఎస్.అబ్రహం సస్పెండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకాలపై చెంచంరాజు మాట్లాడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై ఎంపీడీవో రాటాలు, ఎంఈవో జి.రామారావు విచారించి నివేదిక పంపారు. ఈ మేరకు సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

పటిష్ఠ భద్రత ఏర్పాట్లు : ఎస్పీ

నూజివీడు టౌన్, మార్చి 26 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎస్పీ డి.మేరీప్రశాంతి తెలిపారు. నూజివీడు రూరల్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆమె సందర్శించారు. డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలతో క్రైం మీటింగ్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. 'జిల్లాలో ఇప్పటివరకు అనధికారిక నగదును రూ.97 లక్షలు సీజ్ చేశాం. జీలుగుమిల్లి చెక్‌పోస్టు వద్దే రూ.57 లక్షలను సీజ్ చేశాం. జిల్లావ్యాప్తంగా మొత్తం ఎనిమిది చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి ముమ్మరంగా వెహికల్ చెకింగ్‌ను నిర్వహిస్తున్నాం. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోతో కలిసి అనధికారిక మద్యం, సారా తయారీ ప్రాంతాలపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం'.. అని తెలిపారు. సమావేశంలో డీఎస్పీ జి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సువిధ పోర్టల్‌ను వినియోగించుకోండి : కలెక్టర్

ఏలూరు సిటీ, మార్చి 26 : రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఇంటింటి ప్రచారం , కరపత్రాల పంపిణీ తదితర ప్రచార కార్యక్రమాలకు ముందస్తు అనుమతి పొందేందుకు సువిధ పోర్టల్‌ను వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ కోరారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ సెల్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుమతుల అభ్యర్థనను 48 గంటలకు ముందుగానే సువిధ యాప్ ద్వారా సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకుంటే 24 గంటల్లోనే అనుమతులు మంజూరు చేస్తారన్నారు. జిల్లాలో మంగళవారం ఉదయం వరకు సువిధ పోర్టల్ ద్వారా 319 అనుమతుల కోసం దరఖాస్తులు రాగా 141 దరఖాస్తులకు అనుమతులిచ్చారని, పలు కారణాలపై 87 పెండింగ్‌లో ఉంచగా, 91 దరఖాస్తులను తిరస్కరించారన్నారు. అలాగే ఎన్నికల నిర్వహణకు సంబంధించి మంగళవారం రిటర్నింగ్ అధికారులు, సంబంధిత నోడల్ అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

తాగునీటి ఎద్దడి రాకూడదు..

వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా పటిష్ఠ ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ప్రస్తుత వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వలు కట్టేసేలోగా తాగునీటి చెరువులన్నింటినీ పూర్తి స్థాయిలో నింపుకోవాలని, శివారు గ్రామాల చెరువుల వరకు నీరు అందేలా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కాల్వల్లో గుర్రపుడెక్క, తదితర పూడికతీత సమయంలో ఎట్టి పరిస్థితుల్లో రసాయనాలు వినియోగించకుండా చూడాలని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కృష్ణాడెల్టా పరిధిలోని ఇరిగేషన్ కెనాల్స్‌లో గుర్రపు డెక్క తొలగించేందుకు కాంట్రాక్టర్లు రసాయనాలు వినియోగించినట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, దీనిపై నివేదిక సమర్పించాలని కృష్ణా జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ ప్రసాద్ బాబును కలెక్టర్ ఆదేశించారు. కాల్వల్లో పూడికతీత పనులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. జడ్పీ సీఈవో సుబ్బారావు, డీపీవో శ్రీనివాస విశ్వనాథ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈలు, ఏలూరు కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నామని..

బాధిత కుటుంబాలకు భువనేశ్వరి భరోసా
నిజం గెలవాలి పేరిట పలువురికి పరామర్శ



జంగారెడ్డిగూడెం మహిళలు అభివాదం



యర్రంపేటలో చిన్నకన్నయ్య కుటుంబ సభ్యులకు భువనేశ్వరి పరామర్శ

- ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని వెల్లడి
- రాష్ట్రంలో ఎక్కడ చూసినా దౌర్జన్యాలే
- జగన్ అరాచక పాలనను సాగనంపాలని పిలుపు

ఏలూరు/కొయ్యలగూడెం/జంగారెడ్డిగూడెం/టి.నరసాపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 'తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటుంది. మీకు కష్టాలు ఎదురైనప్పుడు తోడుండేది తెలుగుదేశమే. చంద్రబాబు మీద అక్రమ కేసులు బనాయించారు. రకరకాల ఆరోపణలు చేస్తూ రోజుకొక కట్టుకథ అల్లారు. ఆయనతోపాటు కార్యకర్తలను దండించారు. ఇప్పటికైనా ఈ అరాచక పాలన పోవాల్సిందే' అని నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. 'నిజం గెలవాలి' పేరిట భువనేశ్వరి మంగళవారం ఏలూరు జిల్లా కొయ్యలగూడెం, జంగారెడ్డి గూడెం మండలాల్లో పర్యటించారు. భువనేశ్వరి ఉదయం రాజమండ్రి విమానాశ్రయం నుంచి నేరుగా కన్నాయిగూడెంలోని దిర్శిపోం వెంకటలక్ష్మి, ఎర్రంపేటలో చంద్ర చినకన్నయ్య, పేరంపేటలో భీమడోలు వెంకయ్య, జంగారెడ్డిగూడెంలో నల్లజర్ల కృష్ణ కుటుంబాలన్ని పరామర్శించారు. ఆయా కుటుంబ సభ్యుల కన్నీటి పర్యంతం కాగా, భయం లేదు.. పార్టీ అండగా ఉంటుందంటూ భుజం తట్టి ఓదార్చారు. పార్టీ పక్షాన అన్ని విధాలా మీకు తోడుగా వుంటామని చెప్పారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'మాదక ద్రవ్యాలు, నాసిరకం మద్యం, ప్రజల ప్రాణాలు తీస్తున్నాయి. రాష్ట్రానికి అత్యవసరమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో చంద్రబాబు ఎంతో చొరవ చూపించారు. ఈ నాలుగేళ్లలో వైసీపీ ప్రభుత్వం సర్వ నాశనం చేసింది. బాధిత కుటుంబాలన్నీ సాధారణ, మధ్యతరగతి కుటుంబాలని వీరితోపాటు మిగతా కుటుంబాలు రాష్ట్రంలో అరాచక పాలనకు సాక్షులుగా ఉన్నారు. రాష్ట్ర భవిష్యత్ చంద్రబాబుతోనే సాధ్యం' అని ఆమె పర్యటించిన చోటల్లా చెప్పారు. అరాచక పాలన నుంచి పారద్రోలాలని పిలుపునిచ్చారు. భువనేశ్వరి ఆయా కుటుంబాలను పరామర్శిస్తున్న సమయంలో కొందరు భావోద్వేగంతో కన్నీటి పర్యంతం అయ్యారు. అందరినీ ఆమె ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆమె వెంట మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, ఘంటా మురళి, గన్ని వీరాంజనేయులు, మొడియం శ్రీనివాస్, ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్, చింతలపూడి, పోలవరం అభ్యర్థులు సొంగా రోషన్‌కుమార్, చిర్రి బాలరాజు, పోలవరం టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్ర, మండవ లక్ష్మణరావు, షేక్ ముస్తఫా, పెనుమర్తి రామ్‌కుమార్, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, రాజాన సత్యన్నారాయణ, బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, పారేపల్లి నరేష్, పారేపల్లి రామారావు, సురేష్, సోంబాబు, ముడియం సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.

నేడు భువనేశ్వరి పర్యటన ఇలా..

భువనేశ్వరి మంగళవారం రాత్రి చింతలపూడిలోని 'కె' కన్వెన్షన్‌లో బస చేశారు. రెండో రోజు పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం పదిన్నర గంటలకు టి.నరసాపురం మండలం మక్కినవారిగూడెంలో మృతి చెందిన కార్యకర్త అబ్బదాసరి కృష్ణ నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శిస్తారు. మధ్యాహ్నం 1.15 గంటలకు తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లిలో కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తారు. మధ్యాహ్నం మూడు గంటలకు పెంటపాడు మండలం పశ్చిమ విప్పర్రులో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తారు. 3.55 గంటలకు నిడమర్రులో కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తారు.



నల్లజాక కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నమస్కరిస్తున్న భువనేశ్వరి



బయ్యన్నగూడెంలో మార్గాని వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న భువనేశ్వరి



పేరంపేటలో భీమడోలు వెంకన్న కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న భువనేశ్వరి

పదేళ్లుగా రాష్ట్రాభివృద్ధి లేదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

భీమవరం అర్బన్, మార్చి 26 : రాష్ట్రం పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు భీమవరం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ బీజేపీ తొత్తుగా, టీడీపీ బీజేపీ పొత్తులో ఉంది. వీరిని ఓడిస్తేనే రాష్ట్రం ముందుకు సాగుతుంది. పదేళ్ళలో రాష్ట్రానికి పరిశ్రమలు రాకపోయినా.. వీటి పేరు చెప్పి భూములు తీసుకున్నారు. సీట్లు కొనుక్కుంటున్న నాయకులకు ఎన్నికల్లో పోటీ చేసే అర్హత లేదు. ఇండియా కూటమిలో వున్న పార్టీలతో రాష్ట్రంలో సీపీఎం సీపీఐలు కొన్ని సీట్లు సర్దుబాటు చేసుకున్నాం. సీపీఎం బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి' అని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, మంతెన సీతారాం తదితరులు పాల్గొన్నారు.

■ ఆంధ్రజ్యోతితో ఆఫీసర్

స్వేచ్ఛగా ఓటు వేయాలి..

దెందులూరు ఆర్‌వో లావణ్యవేణి



- ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరిం చాలి. దెందులూరు నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఎన్నికల నియమావళిని అనుసరిస్తూ, అన్ని రాజకీయ పార్టీలు తమవంతు సహకారాన్ని అందించి, ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలి.
- దెందులూరు నియోజకవర్గంలో దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాలు ఉన్నాయి. మొత్తంగా 2,23,777మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 1,09,465 మంది, మహిళలు 1,14,305 మంది, ఇతరులు ఏడుగురు ఉన్నారు. నాలుగు మండలాల్లో కలిపి 239 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి.
- సమస్యాత్మక గ్రామాలను గుర్తించి, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటాం. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమిస్తే చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటాం. ప్రచారంలో అభ్యర్థులు కుల, మత భాషా విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయకూడదు. ఈ విషయంలో చట్టంముందు అందరూ సమానమేనని విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ప్రచారంలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయి.
- ఎన్నికల ప్రచారానికి సంబంధించి ముద్రించే కరపత్రాల ప్రతుల సంఖ్య, ముద్రణ సంస్థ పేరును అదే కరపత్రాలపై ఖచ్చితంగా ముద్రించాలి.

\- పెదవేగి

మాగంటికి బుజ్జగింపు

అసంతృప్తి చల్లార్చే ప్రయత్నాలు.. ఇంకోవైపు గోపాల్ యాదవ్ జంప్



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఏలూరు పార్లమెంట్ స్థానంలో రాజకీయాలు చిత్ర విచిత్రంగా మారుతున్నాయి. ఇంకోవైపు సీనియర్లను బుజ్జగించడానికి తంటాలు పడుతున్నారు. టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ మాగంటి బాబు తీవ్ర అసంతృప్తితో వున్నారు. పార్టీలో సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న సీనియర్ అయిన తన ను పెద్దగా పట్టించుకోవడం లేదని, ఆఖరుకు ఏలూరు లోక్‌సభ స్థానం అభ్యర్థిని ఖరారు చేసినా, మాట వరసకైనా తనను సంప్రదించలేదనే ఆవేదనతో ఆయన ఉన్నారు. గడచిన మూడు రోజులుగా మాగంటి పార్టీ కార్య క్రమాలకు దూరంగా ఉండ డంతో ఆయన పార్టీ మారడం ఖాయమని జిల్లాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. దీనికి తోడు మాగంటి బాబును ఆకర్షిం చేందుకు వీలైతే పార్టీలో చేర్చుకునేందుకు వైసీపీ నేతలు రాయ బారానికి దిగారు. వాస్తవానికి గతంలో రాజశేఖర రెడ్డి మంత్రి వర్గంలో మాగంటి బాబు ఉన్నప్పుడు అప్పట్లో జరిగిన ఓ ఎన్నిక ఫలితం ప్రతికూలంగా రావడంతో ఆయనను అప్పటికప్పుడు మంత్రివర్గం నుంచి తప్పించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాబు టీడీపీలో చేరారు. ఎంపీగా పలుమార్లు పోటీ చేశారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఆయన అనేక నియోజక వర్గాల్లో తనకంటూ ఒక ముద్ర వేసుకున్నారు. అలాంటి ఇమేజ్ ఉన్న సీనియర్ నేత పట్ల పార్టీ అవమానకరంగా ప్రవర్తించిం దని, ఆయన సేవలు అక్కర్లేక పోతే తదుపరి చర్యలు తీసుకోవా ల్సి ఉండవలసిందని ఇప్పుడు మాగంటి అభిమానులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. తొలుత ఏలూరు ఎంపీ స్థానాన్ని ఆయన కూడా ఆశించారు. క్రమక్రమంగా ఆయనను తప్పించి బీసీ నినాదం అందుకున్నారు. దీని ఫలితంగానే మహేష్ కుమా ర్ యాదవ్‌ను అభ్యర్థిగా ఎంపిక చేశారు. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో మాగంటి బాబు ఆయన అనుచర వర్గం కొంత అసంతృప్తిలో మునిగిపోయారు. పార్టీ సీనియర్లు సైతం దూరం గా ఉండడం పార్టీలో అత్యున్నత బాధ్యతలో ఉన్నవారు తమకేం పట్టనట్టు వ్యవహరించిన కారణంగానే మాగంటి మనస్తాపానికి గురయ్యారనే సమాచారం బయటకు పొక్కింది. ఆ వెంటనే వైసీపీ నేతలు రంగంలోకి దిగారు. ఒకా నొక దశలో ఎంపీ స్థానానికి బాబును ఎంపిక చేస్తారని ఇప్పటికే రంగంలో వున్న సునీల్ కుమార్‌ను తప్పిస్తారంటూ ప్రచారం జరిగింది.



ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ టిక్కెట్ ఆశించిన గోరు ముచ్చు గోపాల్ యాదవ్ మంగళవారం పార్టీ మార్చేసి వైసీపీలో చేరిపోయారు. తనకు టిక్కెట్ ఇవ్వకపోవడంతో పాటు అవమానకర రీతిలో ప్రవర్తించా రని, దీనికి విరుగుడుగానే వైసీపీలో చేరినట్టు గోపాల్ యాదవ్ ప్రకటించారు.

బుజ్జగింపులు ఆరంభం

అసంతృప్తి, ఆవేశంలో వున్న సీనియర్ నేత మాగంటి బాబును తెలుగుదేశం బుజ్జగించే పనిలోపడింది. మాగంటి ప్రభావం పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బలంగా ఉన్నందున, ఆయన తీవ్ర నిర్ణయాలు తీసుకోకుండా జాగ్రత్తపడుతోంది. పార్టీ సీనియర్లు ఇప్పటికే రంగంలోకి దిగారు. మాగంటి బాబును సముదాయించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయన అనుకూలురు మాత్రం సరైన నిర్ణయం తీసుకోవాల్సిం దిగా బాబుపై ఒత్తిడి పెంచారు. ఏలూరు లోక్‌సభ స్థానంలో టీడీపీలోని సీనియర్లు కూడా తాజా పరిణామాలపై దృష్టి పెట్టారు.

ఇప్పుడేం చేద్దాం

- ఎంపీ రఘురామకృష్ణరాజు విషయంపై చర్చ
- ఏడు నియోజకవర్గాల అభ్యర్థులు సమావేశం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

గెలుపే లక్ష్యంగా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులు అడుగులు వేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఉమ్మడి సమావేశాలు ఏర్పాటు చేసి సమన్వయంతో ముందుకు వెళుతున్నారు. మరోవైపు నరసాపురం ఎంపీ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ రఘురామకృష్ణంరాజును పోటీలో నిలుపుతారని అంతా ఆశించినప్పటికీ కూటమి తరపున బీజేపీ అభ్యర్థిగా భూపతిరాజు శ్రీని వాస్‌వర్మను ప్రకటించడంతో చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో పార్లమెం టు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల టీడీపీ-జనసేన అభ్యర్థు లు మంగళవారం ఆచంటలో సమావేశమయ్యారు. ఆచంట, పాలకొల్లు, ఉండి, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం అభ్యర్థులు మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, మంతె న రామరాజు, మాజీ ఎమ్మెల్యేలు పులపర్తి అంజిబాబు, ఆరిమిల్లి రాధాకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్ హాజరయ్యారు. సమావేశంలో కూటమి తరపున ఎంపీ అభ్యర్థి విషయమై చర్చకు వచ్చింది. ఇప్పటి వరకు రఘు రామకృష్ణంరాజు పోటీ చేస్తారని అంతా భావించారు. ప్రజల్లోనూ అదే భావన ఏర్పడింది. తాడేపల్లిగూడెంలో టీడీపీ-జనసేన ఉమ్మడి జెండా సభలోనూ తానే పోటీ చేస్తానని చంద్రబాబు, పవన్ కల్యాణ్ సమక్షంలో ఆయనే స్వయంగా ప్రకటించుకున్నారు. ఇప్పుడు బీజేపీ తరపున శ్రీనివాస వర్మను ప్రకటించారు. దీనిపై చర్చించారు. అలాగే ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులను ఎలా ఢీకొట్టాలి ? ఆర్థిక వనరులపై ఏం చేయాలి ? పొత్తులో భాగంగా ఓట్ల ట్రాన్స్‌ఫర్, అసంతృప్తులతో చర్చలు మొదలైన అంశాలపై సమావేశంలో చర్చకు వచ్చాయి. ప్రస్తుతం మారిన రాజకీయ సమీకరణలతో ఆర్థిక వనరుల అంశం ప్రధానంగా మారింది. తణుకులో జనసేన ఇన్‌ఛార్జ్ నుంచి సహకారం లేక పోవడం ప్రస్తావనకు వచ్చింది. ఈ విషయాలను టీడీపీ, జనసేన అధినేతల దృష్టికి తీసుకువెళ్లే బాధ్యతను ఇరుపార్టీల అధ్యక్షులకు అప్పగించారు. మరోవైపు టీడీపీ ఎమ్మెల్యేలతో చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి, ఆర్థిక వనరులపై ఎమ్మెల్యేలు ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. ఏడుగురు అభ్యర్థులు చంద్ర బాబుతో భేటీ కావాలన్న నిర్ణయించారు. మరోవైపు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్న తలంపుతో ఉన్నారు. కూటమి అభ్యర్థుల సమావేశంపై రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. కూటమి ఎంపీ అభ్యర్థి ప్రకటించిన తర్వాత వీరంతా భేటీ కావడం జనంలో చర్చ సాగుతోంది. సమావేశంలో చర్చించిన అంశాలను అభ్యర్థులు గోప్యంగా ఉంచారు.

ఆటో బోల్తా.. ఇద్దరు మహిళల మృతి

మృతులు



సుజాత



కృష్ణకుమారి



ప్రమాదానికి గురైన ఆటో

ఆగిరిపల్లి, మార్చి 26 : కాయకష్టం చేసుకునే మహిళా రైతు కూలీలకు తెల్లవారక ముందే ఆటో రూపంలో మృత్యువు కబళించింది. ఆటో ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందగా మరో మహిళ తీవ్రంగా గాయపడింది. ఆగిరిపల్లి మండలం సర్నాలగొల్లగూడేంకు చెందిన 22 మంది మహిళలు మంగళవారం ఉదయం 6.30 గంటలకు ఒకే ఆటోలో గన్నవరం మండలం వెంపల్లికి పత్తి తీతకు బయల్దేరారు. మార్గమధ్యలో గన్నవరం మండలం వీరపనేనిగూడెం సమీపంలో బ్రాందీషాపు వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి ఆటో అదుపుతప్పి మూడు పల్టీలు కొట్టింది. మహిళలు చెల్లాచెదురుగా పడిపోగా వీర్ల సుజాత (33) వీర్ల కృష్ణకుమారి (48) మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన బడుగు శివమ్మ (46)ను పిన్నమనేని సిద్ధార్థకి ఆస్పత్రికి తరలించగా బ్రెయిన్ సర్జరీ చేయాలని వైద్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన సాకిరి నాగమణి, గుండ్రు పద్మావతిని మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ జి.జి.హెచ్‌కు తరలించారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలు కావడంతో పిన్నమనేని సిద్ధార్థ హాస్పిటల్, నూజివీడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై గన్నవరం మండలం ఆత్కూరు ఎస్ఐ ఫైడిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌చార్జ్ కొలుసు పార్థసారథి క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాల్సిందిగా సూపరింటెండెంట్‌ని కోరారు. పోస్టుమార్టం నిమిత్తం ఇద్దరు మహిళా కూలీల మృతదేహాలను గన్నవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా పార్థసారథి ఆస్పత్రికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

'ఓపెన్' పరీక్షలు ప్రశాంతం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 26 : ఏపీ ఓపెన్ స్కూల్స్ దూరవిద్య పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన పదో తరగతి సాంఘికశాస్త్రం పరీక్షకు జిల్లాలో 626 మంది అభ్యాసకులు దరఖాస్తు చేసుకోగా 524 మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ రసాయనశాస్త్రం పరీక్షకు 531 మందికి 486 మంది, అర్థశాస్త్రం పరీక్షకు 747 మందికి 662 మంది హాజరయ్యారని వివరించారు. జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.




రంగులు తొలగించారు..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెంటపాడు, మార్చి 26: వైసీపీ రంగుల మాటేంటి శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణంలోని 23వ వార్డు చిన ముత్యాలమ్మ ఆలయం వద్ద రేవుకు, శిలాఫలకానికి వేసిన వైసీపీ రంగులు తొలగించారు.

ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ ప్రశాంతిలకు మెడల్స్

డీఎస్పీ, ఇతర సిబ్బందికి కాంస్య పతకాలు


ఐజీ అశోక్‌కుమార్


ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, మార్చి 26 : శాంతి భద్రతలు కాపాడడంలో, కేసుల దర్యాప్తు, పరిపాలనా పరమైన అంశాలపై పరిశీలన జరిపి రాష్ట్రస్థాయిలో ఐపీఎస్ అధికారులకు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బందికి రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి అవా ర్డులను ప్రకటించారు.ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌కు రాష్ట్రస్థాయిలో గోల్డ్ విభాగంలో ఎంపికై అవార్డు పొందారు. ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి సిల్వర్ విభాగంలో ఎంపికయ్యారు. ఐపీఎస్ అధికారి అశోక్‌కుమార్ ఏలూరు రేంజ్ డీఐజీగా 2023 ఏప్రిల్ 12వ తేదీన బాధ్యతలు చేపట్టి ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఏలూరు రేంజ్ ఐజీగా విధులను నిర్వర్తిస్తున్నారు. రేంజ్ పరిధిలో ఏ సంఘటన జరిగినా స్వయంగా పరిశీలించి కేసుల దర్యాప్తు వేగవంతం చేశారు. మేరీ ప్రశాంతి 2023 ఏప్రిల్ 12న జిల్లా ఎస్పీగా ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. జిల్లాలో శాంతి భద్రతలు కాపాడడంలో మేరీ ప్రశాంతి ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు చేపట్టారు. స్పందన కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టారు. గతంలో ఏలూరు దిశ డీఎస్పీగా పనిచేసిన కేవీ సత్యనా రాయణకు, డీసీఆర్బీ ఏఎస్ఐ రమేష్‌బాబు, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ వెంకట సత్యనారాయణ, ఏలూరు సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు, బుట్టాయిగూడెం కానిస్టేబుల్ బాలకృష్ణ, ఏలూరు జిల్లా కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ (పిసి 991), కాని స్టేబుల్ బాలకృష్ణ (పీసీ 2136), ఏలూరు దిశ పోలీస్‌స్టేషన్ మహిళా హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణ (డబ్ల్యుహెచ్‌సి 367)లకు బ్రాంజ్ మెడల్ ప్రకటించారు.



విద్యార్థులకు బంగారు పతకాలను అందిస్తున్న కంభంపాటి హరిబాబు

విద్యార్థులు కొత్త ఆలోచనలతో పరిశ్రమలు స్థాపించాలి

మిజోరం రాష్ట్ర గవర్నరు డాక్టర్ కంభంపాటి హరిబాబు

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 26 : భారతదేశం ప్రపంచానికి దీటుగా ఎంతో అభివృద్ధి సాధించిందని మిజోరం రాష్ట్ర గవర్నరు డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. మంగళవారం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల 44వ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఏదో ఒక దాంట్లో నైపుణ్యం సంపాదించి బయటికి రావాలని సూచించారు. డీఆర్‌డీఏ వంటి సంస్థల్లో జరుగుతున్న పరిశోధనలు పరిశీలించి ఆ రంగంలో నైపుణ్యం సాధించే విధంగా కృషి చేయాలన్నారు. విద్యార్థులు కొత్త ఆలోచనలతో నూతన పరిశ్రమల స్థాపన చేయాలని కోరారు. ఏఐసిటీఈ ఐడియా ల్యాబ్స్ సందర్శించి అక్కడ పరిశోధకులతో మాట్లాడారు. కళాశాల అధ్యక్షుడు సాగి ప్రసాదరాజు, సెక్రటరీ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మలు మాట్లాడుతూ తమ కళాశాల అత్యున్నత ప్రమాణాలు కలిగిన విద్యా సంస్థగా అభివృద్ధి చెందిందన్నారు. హరిబాబు చేతుల మీదుగా కళాశాల వ్యవస్థాపకుడు దివంగత సాగి రామకృష్ణంరాజు పేరిట పోస్టల్ ప్రత్యేక కవరు విడుదల చేశారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలు అందించారు. కళాశాల గౌరవ చైర్మన్ కృష్ణంరాజు, డైరెక్టర్ జగపతిరాజు, ప్రిన్సిపాల్ మురళీకృష్ణంరాజు, కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు రామరాజు, ఎస్వీ రంగరాజు, పాలకవర్గ సభ్యులు విజయ నరసింహరాజు, టెక్నాలజీస్ సీఈవో వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.


సుమలతను సత్కరిస్తున్న ఆచార్యులు, సిబ్బంది

ప్రతి విద్యార్థిని ఉన్నత స్థానాలకు ఎదగాలి

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 26 : ప్రతీ విద్యార్థిని ఉన్నత స్థానాలకు ఎదగాలని కాకినాడ జేఎన్టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.సుమలత అన్నారు. ఏపీ నిట్‌లోని నేచర్ వేల్యూ ఎడ్యుకేషన్ క్లబ్ సహకారంతో సాంకేతికత, మహిళా సాధికారత అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. డాక్టర్ సుమలత మాట్లాడుతూ మహిళలు ఆర్థిక , సామాజిక, రాజకీయ, వ్యాపార, శాస్త్ర , రంగాలలో పురుషులతో సమానంగా రాణిస్తూ దేశ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ప్రతీ విద్యార్థిని స్వశక్తితో స్వేచ్ఛగా ఆలోచనలు చేస్తూ ఎంచుకున్న రంగానికి వన్నె తీసుకురావాలన్నారు. మహిళల రక్షణ కోసం ఎన్నో యాప్‌లు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే సాంకేతికతను అందిపుచ్చుకుని నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ సుమలతను శాలువా, మెమొంటోతో సత్కరించారు. ఫ్యాకల్టీ ఇంచార్జి డాక్టర్ రాజేశ్వరరెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ హిమబిందు, క్లబ్ ప్రధాన కార్యదర్శి కృష్ణప్రియ పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 26 : ఇంటర్మీడియట్ పరీక్షల స్పాట్ వాల్యూయేషన్‌కు సంబంధించి బోటనీ, జువాలజీ, కామర్స్ సబ్జెక్టుల మూల్యాంకనను ఈనెల 28కి బదులుగా ఒకరోజు ముందుగానే అంటే 27వ తేదీ నుంచే ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభిస్తున్నట్టు డీవీఈవో ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. మూల్యాంకన విధులకు సంబంధిత సబ్జెక్టుల నుంచి నియమితులైన ఎగ్జామినర్లను ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు రిలీవ్‌చేసి పంపాలని ఆదేశించారు. ఈ సబ్జెక్టులకు స్క్రూటీనైజర్లుగా నియమితులైన సిబ్బంది 28న ఉదయం 10గంటలకు స్పాట్ క్యాంపునకు విధిగా హాజరుకావాలని సూచిం చారు. మూల్యాంకన విధులకు రిపోర్ట్ చేయని ఎగ్జామినర్లు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున ఇంటర్‌బోర్డు ఆదేశాల ప్రకారం సంబంధిత కళాశాల యాజమాన్యానికి పెనాల్టీ విధిస్తామని హెచ్చరించారు.

'పది' పరీక్షలు ప్రశాంతం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 26: పదో తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన జీవశాస్త్రం పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసిందని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విభాగంలో 24,131 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా 23,434 మంది, ప్రైవేటు విభాగంలో 5,285 మందికి 3,108 మంది హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 697 మంది, ప్రైవేటు విభాగం విద్యార్థులు 2,177 మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

26-03-2024 పొగాకు ధరలు (రూ.)



పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	241	235	239.82
జంగారెడ్డిగూడెం-1	240	235	239.60
జంగారెడ్డిగూడెం-2	240	235	239.71
కొయ్యలగూడెం	240	235	239.32
గోపాలపురం	241	235	238.12




కుముదవల్లి ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీ.. ఉంగుటూరులో తనిఖీలు... భువ్వనపల్లిలో నగదు సీజ్ చేసిన ఎస్సై శ్రీను

లెక్క చూపని సొమ్ము స్వాధీనం

నగదు, మద్యం రవాణా అడ్డుకునేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేపడుతోంది..మంగళవారం వివిధ ప్రాంతాల్లో ఆధారాలు చూపని నగదును స్వాధీనం చేసుకున్నారు.

కుముదవల్లి వద్ద రూ.10 లక్షలు..

పాలకోడేరు, మార్చి 26 : కుముదవల్లి రైల్వేగేటు వద్ద వాహనాలను చెక్ చేస్తుండగా బైక్‌పై వెళ్తున్న వ్యక్తి నుంచి పది లక్షల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్టు పాలకోడేరు మండల ఫ్లైయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ ఎంఎస్ఆర్ ఆంజనేయులు తెలిపారు. ఏఎస్ఐ మోహన రావు, సిబ్బంది ప్రసాదు,కొండబాబులు వాహనాలను చెక్ చేస్తుండగా కుముదవల్లి నుంచి భీమవరం వైపు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని చెక్ చేయగా అతని వద్ద రూ. 10 లక్షలు నగదు దొరికిందని తెలిపారు. మీనా బిస్కెట్ కంపెనీకి చెందన నగదు అని బ్యాంక్‌కు తీసుకువెళ్తున్నామని చెప్పినప్పటికీ సరైన పత్రాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకుని ఉండి తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి అప్పగించినట్లు తెలిపారు.

భువ్వనపల్లిలో 1.50 లక్షలు

నిడమర్రు: నిడమర్రు మండలం భువ్వనపల్లిలో మంగళవారం ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా తీసుకువెళుతున్న 1.50 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్సై ఆర్.శ్రీను తెలిపారు. ఎఫ్ఎస్‌టి టీమ్ ఇన్‌చార్జి ఎస్.కె. హబీబ్ బాషా డీఈవో ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా భువ్వనపల్లి దుర్గమ్మ గుడి వద్ద సీతారామపురం నుంచి భీమవరం వైపు వెళ్తున్న కారులో 1.50 లక్షల నగదును నడింపల్లి రాజన్‌రాజు వద్ద నుంచి స్వాధీనం చేసుకుని సీజ్ చేసి ఏలూరు ట్రెజరీకి పంపినట్టు తెలిపారు.

రెండు చోట్ల రూ.1,08,500

ఉంగుటూరు: ఉంగుటూరు నియోజకవర్గంలో మంగళవారం మూడు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన తనిఖీలలో రూ.1.08,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రిటర్నింగ్ అధికారి, ఏలూరు ఆర్డీవో ఖాజావలి తెలిపారు. ఉంగుటూరు గ్రామంలో రూ.53,500 నగదు, గణపవరం మండలం మొయ్యేరులో రూ.55000,

వీరవాసరంలో రూ.లక్ష స్వాధీనం

వీరవాసరం : వీరవాసరం-పెనుమంట్ర రహదారిలో ద్విచక్రవాహనంపై నగదు తీసుకువెడుతున్న యువకుల నుంచి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ రూ.లక్ష స్వాధీనం చేసుకొంది. పంజావేమవరం సాయిబాబా ఆలయం వద్ద తనిఖీ నిర్వహిస్తుండగా కోనసీమ జిల్లా మాచవరం గ్రామానికి చెందిన గెద్దాడ సూరిబాబు వద్ద నగదును గుర్తించారు. నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయంలో నగదు జమ్మ చేశారు. స్క్వాడ్ సభ్యులు డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరావు ఏఎస్ఐ వీరభద్రరావు పాల్గొన్నారు.



అల్లిపల్లి చెక్‌పోస్టు వద్ద ఆర్టీసీ బస్సు, కారు తనిఖీ చేస్తున్న అదనపు ఎస్పీ స్వరూపరాణి



నూజివీడు సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

అక్రమ మద్యం కట్టడికి ప్రత్యేక బృందాలు

జిల్లా వ్యాప్తంగా రంగంలోకి దిగిన బృందాలు

చేపలు, రొయ్యల మేత, కోళ్ల వ్యర్థాల లోడుల్లో రవాణా

ఏలూరు క్రైం, మార్చి 26 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ మద్యం జిల్లాకు రానివ్వకూడదని ఎన్నికల సమయంలో ఓటర్లకు మద్యాన్ని ప్రలోభాలుగా చేయడానికి వీలులేకుండా జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి కట్టడి చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్ర రావుల ఆదేశాలతో ప్రత్యేక బృందాలను జిల్లాలో ఏర్పాటు చేశారు. గత ఎన్నికల్లో ఎక్కడెక్కడ అక్రమ మద్యం నిల్వలపై కేసులు నమోదు చేశారో ఆ కేసుల వివరాలు అందులోని ముద్దాయిల వివరాలు, ప్రస్తుతం వారి స్థితి గతులు ఏ పార్టీ నాయకునికి వారు ఉన్నారో వంటి వివరాలపై ఆరా తీస్తున్నారు. అంతేకాకుండా ఇప్పటికే జిల్లాకు పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి కొన్ని చేపల లోడు, కొన్ని రొయ్యల మేత, రొయ్య పిల్లల రవాణా ముసుగులో లారీలు, కంటైనర్లలో అక్రమ మద్యం జిల్లాకు వస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. అదే విధంగా తెలంగాణా రాష్ట్రం నుంచి కోళ్ల వ్యర్థాల లోడులలో ఈ అక్రమ మద్యం జిల్లాకు తీసుకువస్తున్నారని సమాచారం ఉండడంతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు. గతంలో అక్రమ మద్యాన్ని తరలించే సమయంలో రవాణాను ఏ విధంగా వినియోగించారు. అందుకు ఎలాంటి వాహనాలు వినియోగించారు వంటి వాటిని అధికారులు పరిశీలన చేస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. త్వరలోనే జిల్లా సరిహద్దుల్లో కూడా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలకు చర్యలు చేపట్టనున్నారు.జిల్లా ఎన్నికల అధికారులు ఇప్పటికే ఆకస్మికంగా వివిధ చెక్‌పోస్టుల వద్ద ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి కూడా స్వయంగా ఏలూరు జిల్లా సరిహద్దులో ఉన్న తెలంగాణ రాష్ట్ర చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. జిల్లా అదనపు ఎస్పీ స్వరూపరాణి మంగళవారం సాయంత్రం చింతలపూడి మండలంలోని అల్లిపల్లి, లింగాయిగూడెం చెక్‌పోస్టులను పరిశీలించారు. గంజాయి, నాటుసారా, మద్యం, నగదు అక్రమ రవాణా జరుగకుండా స్వయంగా పరీక్షించి అక్కడ ఉన్న సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అక్రమ మద్యం జిల్లాకు వివిధ మార్గాల్లో వస్తుందన్న సమాచారంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వివిధ ప్రాంతాల్లో నిఘా ఉంచారు.

నియంత్రణకు ఉమ్మడి దాడులు

నూజివీడు, మార్చి 26 : ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ, ఏపీ సరిహద్దుల్లో ఉమ్మడి దాడులకు చర్యలు తీసుకోవాలని ఖమ్మం, ఏలూరు జిల్లాల అధికారులు నిర్ణయించారు. నూజివీడు సారథి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఇరు రాష్ట్రాలకు సంబంధించి అనధికార మద్యం నియంత్రణపై ఇంటర్ స్టేట్ కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఏలూరు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె.రామకృష్ణ, అదనపు ఎస్పీ సూర్య చంద్రరావు,ఖమ్మం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.నాగేంద్రరెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎన్.వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఏలూరు జిల్లా సరిహద్దులోని తెలంగాణ రాష్ట్ర ప్రాంతాల్లో అధికారిక బెల్టుషాపులు ఉండటంతో ఏలూరు జిల్లాలో అనధికారికంగా మద్యం రవాణాను అరికట్టడంలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. నేరుగా షాపుల నుంచి లిక్కర్ కొనకుండా బెల్టుషాపులో లిక్కర్ కొనుగోలు చేస్తున్న రవాణాదారులు, మద్యాన్ని సరిహద్దులు దాటిస్తున్నారని ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాల అధికారులు ఉమ్మడిగా దాడులు చేయాల్సిన అవసరం ఉందని నిర్ణయించారు. అదేవిధంగా రాష్ట్రంలోకి తెలంగాణ, యానాం, గోవా నుంచి మద్యం రవాణా అవుతోందని, ప్రధానంగా గుడ్లు, చేపలు తదితర రవాణా లారీలలో రహస్యంగా ఉంచిన ర్యాక్‌లో మద్యం ఉంచి రవాణా చేస్తుండటంతో వాటిని పట్టుకోవడం కష్టంగా ఉందని, ఈ పరిస్థితిని నివారించేందుకు ప్రత్యేక నిఘాను కొన సాగిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. సత్తుపల్లి ఎక్సైజ్ సీఐ ని.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, నూజివీడు సెబ్ సీఐ రమణ, ఎస్సై కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీపుష్పయాగోత్సవం



ఆచంట, మార్చి 26: కొడమంచిలి వేంకటేశ్వరస్వామి తిరువార్షిక కల్యాణోత్సవాలు సోమవారం రాత్రి ముగిశాయి. ఆఖరి రోజున స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలతో పాటు పుష్పయాగోత్సవం, ముత్తదువులకు కుంకుమ భరణిలు పంచిపెట్టే కార్యక్రమాన్ని గ్రామానికి చెందిన చిలుకూరి అబ్బారావు, అనసూయ దంపతులచే వేడుకగా నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువు మానేపల్లి ఉమా రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కరుగోరుమిల్లి ర్యాంప్‌ను పరిశీలించిన మైనింగ్, పోలీసు, సెబ్ అధికారులు

ఆచంట, మార్చి 26: ఆచంట మండలం కరుగోరుమిల్లి ఇసుక ర్యాంప్‌ను మంగళవారం మైనింగ్, పోలీసు, సెబ్ , రెవెన్యూ అధికారులు పరిశీలించారు. కొన్ని రోజులుగా అనుమతులు ఉన్నాయంటూ పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. దీంతో ప్రతీరోజూ అనేక వాహనాలతో ర్యాంప్ రద్దీగా ఉంటున్నది.అధికారులు వెళ్లే సమయానికి ర్యాంప్‌లో ఇసుక తవ్వకాలు నిలిపివేశారు. తవ్వకాలు ఒక్కసారిగా నిలిపి వేయడంతో అసలు ఈ ర్యాంప్‌కు అనుమతులున్నాయా లేవా అనే అనుమానం కలుగుతోంది.అధికారులు జిల్లాలోని పరిశీలనలో భాగంగా కరుగోరుమిల్లి ర్యాంప్ కూడా పరిశీలించారు.

క్రైం కార్నర్

ఓవర్‌హెడ్ ట్యాంకు పైనుంచి పడి కార్మికుడిమృతి

పెదవేగి, మార్చి 26 : నిర్మాణంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు పైనుంచి పడి వ్యక్తి మృతి చెందాడు. దీనిపై కొప్పులవారిగూడెం వీఆర్వో సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేశారు.పెదవేగి మండలం కొప్పులవారిగూడెంలో కొత్తగా ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. పెదపాడు మండలం ఏపూరు గ్రామానికి చెందిన తోట శ్రీను ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులకు వస్తున్నాడు. ట్యాంకు పైభాగాన సెంట్రింగ్ పనులు చేస్తుండగా మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు ట్యాంకుపై నుంచి కిందపడిపోయాడు. తలకు తీవ్రగాయం అవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

ఏలూరు క్రైం, మార్చి 26 : రాత్రివేళ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని ఏలూరు త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు శనివారపుపేటకు చెందిన శిరిబత్తుల వరలక్ష్మి శనివారపుపేట మార్కెట్ వద్ద మద్యం బాటిల్స్ విక్రయిస్తుండగా త్రీటౌన్ సీఐ వెంకటేశ్వరరావు వారిని అరెస్టు చేసి పది మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు ఫిల్‌హౌస్‌పేటకు చెందిన అర్జగడ్డ సతీష్‌కుమార్ సత్రంపాడులో మద్యం బాటిల్స్ విక్రయిస్తుండగా అరెస్టు చేసి నాలుగు బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. పడమర వీధినకు చెందిన విరాల రమేష్‌బాబు రామకృష్ణాపురం వద్ద మద్యం విక్రయిస్తుండగా అతనిని అరెస్టు చేసి ఆరు బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

చెవిటి, మూగ యువతిని మోసగించిన వ్యక్తిపై కేసు

పాలకోడేరు, మార్చి 26 : పుట్టుకతోనే చెవిటి, మూగ అయిన యువతిని ప్రేమించానని, పెళ్ళి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసి మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రమైన పాలకోడేరులోని కొత్తపేటకు చెందిన చెవిటి, మూగ యువతిని అదే గ్రామానికి చెందిన పెన్మెత్స దుర్గా సూర్యనారాయణ రాజు పెళ్లి చేసుకుంటానని చెప్పి అఘాయిత్యానికి పాల్పడ్డాడని తెలిపారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పదోన్నతులు లేవు.. జీతాలూ లేవు..

తొమ్మిది నెలలుగా దేవదాయ శాఖ ఉద్యోగుల అవస్థలు

జూనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్-3 ఈవోలుగా పదోన్నతులు

నిలిపివేసిన ఉన్నతాధికారులు

కోర్టుకు వెళ్లిన ఉద్యోగులు..అనుకూలంగా తీర్పు

భీమవరం టౌన్,మార్చి 26 :దేవదాయశాఖలో జూనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్-3 ఈవోలుగా పదోన్నతులు ఇచ్చారు. దేవదాయ శాఖ అధికారులు వాటిని నిలిపివేశారు. ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే వారికి అనుకూలంగా ఆదేశాలు వచ్చాయి. అయితే తొమ్మిది నెలలు కావొస్తున్నా వారికి పదోన్నతలు ఇవ్వలేదు.. జీతాలూ ఇవ్వడం లదు. తొమ్మిది నెలలుగా జీతాలు లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి అద్దె కట్టలేని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవదాయశాఖలో జూనియర్ అసిస్టెంట్లుగా విధులునిర్వహిస్తున్న వారికి అర్హత ప్రకారం వారిని గ్రేడ్- 3 కార్య నిర్వహణ అధికారులుగా పదోన్నతులు కల్పిస్తూ 2023 జూన్ 27న ఉత్తర్వులు ఇచ్చారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 19 మంది అర్హులుగా ఉండటంతో వారికి పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు అందించారు. ఈ నియామకాలను నిలపుదల చేస్తూ అదే ఏడాది జూలై 17న దేవదాయ ధర్మదాయశాఖ అధికారులు ఆదేశాలు జారీచేశారు. దీంతో వీరంతా హైకోర్టును ఆశ్రయించారు. తమకు అన్ని అర్హతలు ఉన్నాయని తమను పదోన్నతుల్లో కొనసాగించాలని కోరగా వారికి పదోన్నతలు కల్పించాలని ఆగస్టు 18న కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను కూడా ఖాతరు చెయ్యకపోవడంతో వీరంతా మరోసారి న్యాయస్థానంలో పిల్ వేశారు. ప్రభుత్వం రద్దుచేసిన ఉత్తర్వులను కొట్టివేసి పదోన్నతులు కల్పించాలని గత డిసెంబరులోనే ఆదేశాలు ఇచ్చింది. ఈ ఉత్తర్వులు ఇచ్చి మూడు నెలలు గడుస్తోంది. ఇప్పటికీ దేవదాయశాఖ అధికారులు ఈ వ్యవహారంలో నాన్పుడు ధోరణి అవలంభిస్తున్నారంటూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

జీతాలు లేక నానా ఇబ్బందులు

అర్హతలు ఉండి కూడా పదోన్నతులు పొందలేకపోయామని,అధికారులు తమకు ప్రతికూలంగా వ్యవహరించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. తొమ్మిది నెలలు అవుతున్నా జీతాలు లేకపోవడంతో ఆర్థికంగా అవస్థలు పడుతున్నామని ఇటు జూనియర్ అసిస్టెంట్లుగా కూడా విధులు నిర్వహించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు లేకపోవడంతో అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొ స్తున్నామంటున్నారు. తమకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

పలు రైళ్లు రద్దు..కొన్ని మళ్లింపు



ఏలూరు క్రైం మార్చి 26 : దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో మరమ్మతులు జరుగుతున్న కారణంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొన్ని రైళ్లను రద్దు చేశారు.మరి కొన్ని రైళ్లను దారి మళ్లించారు.వాటి వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ నుంచి ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా రాకపోకలను పూర్తిగా రద్దు చేశారు. ఈ రైళ్ల విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా మళ్లించారు.

రద్దయిన రైళ్లు ఇవీ..

17219 మచిలీపట్టణం-విశాఖపట్టణం ఏప్రిల్ 1 నుంచి 28 వరకూ రద్దు
17220 విశాఖపట్టణం-మచిలీపట్టణం ఏప్రిల్ 2 నుంచి 29 వరకూ..
22701 గుంటూరు- విశాఖపట్టణం ఏప్రిల్ 1 నుంచి 28 వరకూ
22702 విశాఖపట్టణం -గుంటూరు ఏప్రిల్ 1 నుంచి 28 వరకూ

దారి మళ్లించిన రైళ్లు

దారి మళ్లించిన రైళ్లు ఏలూరు, తాడేపల్లిగూడెంల మీదుగా వెళ్లకుండా విజయవాడ నుంచి గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా రాకపోకలు కొనసాగించనున్నాయి.

22643 యర్నాకుళం జంక్షన్ - పాట్నా ఏప్రిల్ 1, 8, 15, 22 వరకూ
12756 భావనగర్ - కాకినాడ పోర్టు ఏప్రిల్ 6, 13, 20, 27 వరకూ
12509 ఎస్ఎంవి బెంగళూరు- గౌహటి ఏప్రిల్ 3, 5, 10,12,17, 19, 24, 26
11019 ఛత్రపతి శివాజీ టెర్మినల్-భువనేశ్వర్ ఏప్రిల్ 1, 3, 5, 6, 8, 10, 12, 13, 15, 17, 19, 20, 22, 24, 26, 27
13351 ధన్‌బాగ్ - అల్సాస్ ఏప్రిల్ 1 నుంచి 28 వరకూ
18111 టాటా - యశ్వంత్‌పూర్ ఏప్రిల్ 4, 11, 18, 25
12376 జాసిద్దిత్ - తాంబ్రం ఏప్రిల్ 3, 10, 17, 24
22837 హర్దాయ్ - ఎర్నాకుళం జంక్షన్ ఏప్రిల్ 1, 8, 15, 22
18637 హర్దాయ్ - ఎస్ఎంవీ బెంగళూరు ఏప్రిల్ 6, 13, 20, 27
12835 హర్దాయ్ - ఎస్ఎంవీ బెంగళూరు ఏప్రిల్ 2,7, 9,14,16, 21, 23, 28
12889 టాటా - ఎస్ఎంవీ బెంగళూరు ఏప్రిల్ 5, 12, 19, 26


వచ్చే నెలాఖరు వరకు బెంగళూరు ఎక్స్‌ప్రెస్ పొడిగింపు

నరసాపురం, మార్చి 26:నరసాపురం బెంగళూర్ల మధ్య ప్రతి శుక్రవారం నడుస్తున్న వీక్లి ఎక్స్‌ప్రెస్‌ను ఏప్రిల్ 27 వరకు పొడిగిస్తూ దక్షణ మధ్య రైల్వే ఉత్తర్వులు జారీ చేసింది. రెండేళ్లుగా నడుస్తున్న ఈ ఎక్స్‌ప్రెస్ ఈ నెలాఖరుతో ముగుస్తుంది. మళ్లీ పొడిగించడం లేదంటూ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు రైల్వే అధికారులు స్పందించారు. 07153, 07154 నెంబర్లతో ఈనెల 29 నుంచి ఈ ఎక్స్‌ప్రెస్ యధావిధిగా నడుస్తుందని ప్రకటించింది. నరసాపురం నుంచి వచ్చేనెల 5, 12, 19, 26 తేదీల్లో, తిరుగు ప్రయాణంలో బెంగుళూరు నుంచి ఈనెల 30, ఏప్రిల్ 6, 13, 20, 27 తేదీల్లో ఈరైలు నడవనుంది. మంగళవారం నుంచే ఆన్‌లైన్ రిజర్వేషన్ బుకింగ్ అందుబాటులోకి తెచ్చింది. పాలకొల్లు, భీమవరం టౌన్, కైకలూరు, విజయవాడ, ఒంగోలు, రేణుగుంట, కాట్‌పాడి మీదుగా బెంగుళూరుకు వెళ్లనుంది.

వారికి వద్దు...వీరికి ముద్దు !

'పది' జవాబుపత్రాల మూల్యాంకన విధులకు వింత పరిస్థితులు

యువ టీచర్లకు నడుం నొప్పులట.. అరవైఏళ్ల ఉపాధ్యాయుల్లో ఆసక్తి



ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 26 : పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనానికి జిల్లాలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. మూడుపదుల వయస్సుగల సబ్జెక్టు నిపుణులు జవాబు పత్రాలను దిద్దేందుకు పలు 'అనారోగ్య' కారణాలను సాకుగా చూపుతూ మినహాయింపుల కోసం అభ్యర్థిస్తుండగా, ఆరుపదుల వయస్సులోనూ ఆన్సర్ స్క్రిప్టులను మూల్యాంకనం చేసేందుకు తాము పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నామంటూ స్పాట్ విధులకు ముందుకు వస్తుండడం జిల్లావిద్యాశాఖ అధికార వర్గాలను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 8వ తేదీ వరకు జరగనున్న టెన్త్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనకు ఏలూరు జిల్లాలో అసిస్టెంట్ ఎగ్జామినర్లు 785 మంది ఆయా సబ్జెక్టుల్లో నిపుణత గల టీచర్లు, 133 మంది చీఫ్ ఎగ్జామినర్లు, మార్కులను లెక్కించి నమోదు చేసేందుకు వినియోగించే 266 మంది స్పెషల్ అసిస్టెంట్లు (చెకర్)ల నియామకాలకు జిల్లావిద్యాశాఖ చర్యలు చేపట్టింది. వివిధ తీవ్ర అనారోగ్య కారణాలు, వయస్సు 59 నుంచి 62 ఏళ్ల వరకుగల సీనియర్ టీచర్లను మానవతా దృక్పథంతో స్పాట్ విధుల నుంచి ముందుగానే మినహాయింపులను ఇచ్చారు. మరోవైపు ఆయా సబ్జెక్టుల్లో కనీసం మూడేళ్ల బోధనానుభవం గల ఉపాధ్యాయులనే మూల్యాంకన విధు లకు నియమించాలని నిర్ణయించి ఆ మేరకు అర్హుల జాబితాలను ఇటీవల విడుదల చేశారు. దీంతో పలువురు టీచర్లు తాము స్పాట్ విధులు చేయ లేమంటూ మినహాయింపుల కోసం డీఈవో కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు ప్రారంభించారు. కొందరైతే తమకు తెలిసిన వారితో రికమండేషన్‌లను తీసుకొచ్చారు. తీరా ఇటువంటి అభ్యర్థనలను పరిశీలిస్తే దాదాపు మినహాయింపు కోరిన వారందరూ 28 ఏళ్ల నుంచి 32 ఏళ్ల లోపువారు ఉండడం, అందులోనూ వీరిలో పలువురు తాము నడుమునొప్పి, కీళ్లనొప్పులతో ఉన్నా మంటూ కారణాలుగా చూపడంతో డీఈవో కార్యాలయవర్గాలు అవాక్క య్యాయి. మరికొందరైతే సంబంధిత రోగాలు, రుగ్మతలతో బాధ పడుతున్నామంటూ వైద్య ధ్రువీకరణపత్రాలు సమర్పించడం గమనార్హం.

స్పాట్ ఆర్డర్లు జారీ

మూల్యాంకన విధులకు అవసరమైన బోధనా సిబ్బంది సంఖ్యకు అదనంగా 50 శాతం మందిని ముందు గానే గుర్తించినందున ఎటువంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం లేదని డీఈవో కార్యాలయ అధికారులు వివరించారు. అయితే సీనియర్లు, జూనియర్లు జవాబుపత్రాలు దిద్దితే మూల్యాంకనలో వ్యత్యాసం ఉంటుం దని, సీనియర్ల వల్ల పారదర్శకత ఉంటుందనే వారూ లేకపోలేదు. ఇదిలా ఉండగా జిల్లాకు ఈ ఏడాది రెండు లక్షల జవాబుపత్రాలు మూల్యాంకనం నిమిత్తం కేటాయించారు. ఈ ఏడాది నుంచి ఒక్కో జవాబు పత్రం మూల్యాంకనానికి ఇచ్చే పారితోషకాన్ని రూ.6.50 పైసల నుంచి రూ.10లకు పెంచినప్పటికీ స్పాట్ విధుల పట్ల టీచర్లు ఆసక్తి చూపకపోవడం విశేషం. కాగా అనారోగ్య కారణాలు, ఇతర కారణాలతో మినహాయింపులు పోను మిగతావారికి మంగళవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత స్పాట్ విధులకు నియామక పత్రాలను జిల్లా విద్యాశాఖ విడుదల చేయడానికి తుదిచర్యలు చేపట్టింది. ఇకమీదట ఎవరి నుంచీ మినహా యింపునకు అభ్యర్థన లేఖలను స్వీకరించబోమని, 59 ఏళ్ల వయస్సు దాటినందున తామే మినహాయింపునిచ్చిన సీనియర్ ఉపాధ్యాయుల్లో ఎవరైనా స్పాట్ విధులు నిర్వర్తించేందుకు ముందుకొస్తే ఆహ్వానిస్తున్నట్టు డీఈవో అబ్రహం వెల్లడించారు.

పూజారిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి


మాట్లాడుతున్న బుచ్చి రామ్‌ప్రసాద్

ఏలూరు టూటౌన్, మార్చి 26: ఆలయ పూజారిపై దాడి చేసిన వైసీపీ నాయకులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ బ్రాహ్మణ సాధికార సంఘం కన్వీనర్ బుచ్చి రామ్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాకినాడ శివాలయంలో పూజారి సరిగా అర్చన చేయలేదని వైసీపీ నాయకులు దుర్భాషలాడి దాడి చేయడం దారుణమన్నారు. వైసీపీ అండతో బ్రాహ్మణులపై ఉన్మాదంగా వ్యవహరించడాన్ని ఖండించారు. బ్రాహ్మణులను, హిందువులను వైసీపీ ప్రభుత్వం అణగదొక్కాలని చూస్తుందన్నారు. రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని పూజలు చేసే పూజారిని కాలితో తన్నడాన్ని బ్రాహ్మణులు తీవ్రంగా పరిగణిస్తున్నారన్నారు. నిందితులను అరెస్టు చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ ఎంటీఎస్ శర్మ మాట్లాడుతూ ఐదేళ్లుగా అర్చకులు, పురోహితులు, బ్రాహ్మణులపై వైసీపీ దాడులు కొనసాగిస్తూనే ఉందన్నారు. పూజారిని కాలితో తన్నిన కార్పొరేటర్‌కు శిక్షపడేవరకు బ్రాహ్మణులంతా కలసి ఉద్యమం కొనసాగిస్తామన్నారు. ఇప్పటి వరకు 103 దేవాలయాలపై వైసీపీ దాడులు నిర్వహించిందన్నారు. అంతర్వేదిలో దేవుని రథాన్ని తగలబెడితే ఇంత వరకు నిందితులను ప్రభుత్వం గుర్తించకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఉప్పాల జగదీష్‌బాబు, సత్యవాడ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ యువజన సంఘం ఆగ్రహం


సమావేశంలో పాల్గొన్న బ్రాహ్మణులు

ఏలూరు టూటౌన్, మార్చి 26: అర్చకులపై వైసీపీ గుండాల దాడిని బ్రాహ్మణులంతా తీవ్రంగా పరిగణిస్తున్నారని బ్రాహ్మణ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నుదురుపాటి కృష్ణచైతన్య శర్మ అన్నారు. వన్‌టౌన్ కల్యాణ మండపంలో బ్రాహ్మణ, అర్చక, పురోహితుల ఆత్మీయ సమావేశం మంగళవారం కె.రవికుమార్‌శర్మ ఆధ్వర్యంలో జరిగింది. కృష్ణచైతన్యశర్మ, గౌరవ సలహాదారు వెంపటి శ్రీరామరవికుమార్ శర్మ మాట్లాడుతూ కాకినాడలో అర్చకులపై దాడి చేసిన వైసీపీ నాయకులను కఠినంగా శిక్షించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. అర్చకులు, పురోహితులందరిని సంఘటితం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. వైసీపీ పాలనలో దేవాలయాలకు, అర్చకులకు, బ్రాహ్మణులకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో బ్రాహ్మణులు, అర్చకులు వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

● ద్వారకాతిరుమల: కాకినాడ భీమేశ్వరస్వామి ఆలయ అర్చకులు సాయి, విజయకుమార్‌పై మాజీ కార్పొరేటర్, వైసీపీ నాయకుడు సిరియాల చంద్రరావు దాడి హేయమైన చర్య అని ద్వారకాతిరుమల బ్రాహ్మణ సంఘ నాయకుడు గోవిందవఝుల వెంకటరమణమూర్తి శర్మ తీవ్రంగా ఖండించారు. ఇటీవల బ్రాహ్మణులపై దాడులు చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. దాడి జరిగిన సమయంలో ఆలయంలో సీసీ కెమెరాలు పనిచేయపోవడం, ఇందుకు అధికారులు సహకరించడం సరైన పద్ధతి కాదంటూ మండిపడ్డారు.

ప్రశాంతంగా సాగుతున్న పదో తరగతి పరీక్షలు


పరీక్షా కేంద్రానికి వెళుతున్న విద్యార్థులు

పెదవేగి, మార్చి 26: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మండలంలో ఆరు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. 1027మంది మంది పరీక్షలు రాయాల్సి ఉండగా మంగళవారం పరీక్షకు 918మంది హాజరయ్యారని ఎంఈవో సీహెచ్.బుధవాస్ తెలిపారు. పరీక్షా కేంద్రాల దగ్గర పటిష్ఠ బందోబస్తుతోపాటు విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, ప్రథమ చికిత్సా సదుపాయం కల్పించామని ఎంఈవో వివరించారు.

● పోలవరం: మండలంలో పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. గూటాల జడ్పీ ఉన్నత పాఠశాలలో 156 మంది విద్యార్థులకు 120 మంది, పోలవరం ప్రభుత్వోన్నత పాఠశాలలో 262 మందికి 256 మంది, కచేరి సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 118 మంది విద్యార్థులకు 71 మంది హాజరైనట్లు ఉపాధ్యాయులు జూరెడ్డి చంద్రశేఖర్, మూర్తి తెలిపారు.

● పెదపాడు: మండలంలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో పది పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. మొత్తం 1325 మంది విద్యార్థులకు 1149 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 176 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు.

ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి వజ్రాయుధం


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

లింగపాలెం, మార్చి 26: సింగగూడెం, కొత్తపల్లి గ్రామాల్లో కళాకారులు ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రాంబాబు ఆధ్వర్యంలో కీర్తన కల్చరల్ సొసైటీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బుర్రకథ కార్యక్రమంలో ఓటు ప్రజాస్వామ్యానికి వజ్రాయుధం అని వివరించారు. ఓటర్లు అందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటుహక్కు విలువైనదని, దానిని అమ్ముకోకూడదని, ఓటును అమ్ముకుంటే ఐదేళ్ల భవిష్యత్తును తాకట్టుపెట్టినట్లేనన్నారు. కార్యక్రమంలో కళాకారులు చిరంజీవి, ఎం.రత్నరాజు, పంచాయతీ కార్యదర్శి పాపయ్య, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుపై సొసైటీలో విచారణ


విచారణ నిర్వహిస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్

టి.నరసాపురం, మార్చి 26: టి.నరసాపురం సొసైటీ వాటర్ ప్లాంట్ మూసివేతకు కారణాలు, సొసైటీలో విలువైన సామగ్రి చోరీపై అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. ప్లాంట్‌లో పని చేసే సిబ్బందికి న్యాయం చేయాలని ఇటీవల స్పందనలో టి.నరసాపురం గ్రామానికి చెందిన డి.విల్సన్‌బాబు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కోపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మోహన్‌బాబు మంగళవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు సిబ్బంది బదిలీలు రద్దు చేయాలి

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 26: నగరంలోని పలు అర్బన్ హెల్త్‌సెంటర్లలో పనిచేస్తున్న 16మంది నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్టు సిబ్బంది ఆకస్మిక బదిలీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా బదిలీచేయడాన్ని నిరసిస్తూ ఎన్‌హెచ్‌ఎం కమిషనర్‌కు వినతిపత్రాన్ని పంపినట్టు ఏపీ నర్సుల పోరాట కమిటీ రాష్ట్ర నాయకులు ఎస్.ప్రసాద్, ఎం.చిన్నారి, డి.కోటేశ్వరరావు మంగళవారం తెలిపారు. అక్రమ బదిలీలకు కారకులైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులపై విచారణ నిర్వహించి చర్యలు చేపట్టాలని కోరారు.


పోలవరం, ఉంగుటూరు మండలాల్లో సాయుధ బలగాలు, పోలీసుల కవాతు

గ్రామాల్లో సాయుధ బలగాల కవాతు

ఉంగుటూరు, మార్చి 26: మండలంలోని సమస్యాత్మక గ్రామాలలో ఎన్నికలు సజావుగా సాగేందుకు వీలుగా సాయుధ బలగాలు, పోలీసులు మంగళవారం కవాతు చేశారు. నిడమర్రు సీఐ.మోగంటి వెంకట సుభాష్, చేబ్రోలు ఎస్ఐ ఎ.మణికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు, సాయుధ బలగాలు పుర వీధులలో కవాతు నిర్వహించారు. కాకర్లమూడి, ఉప్పాకపాడు, బొమ్మిడి, నీలాద్రిపురం తదితర గ్రామాలలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్‌పై అవగాహన కల్పించారు.

● పోలవరం: మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గల గ్రామాలలో కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. మండలంలో ఎల్ఎన్‌డీ.పేట, గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, ఎల్లండీపేట గ్రామాల పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లలో ధైర్యం కలిగించడానికి చైతన్య పరచడానికి కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించినట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.


ఏలూరులో టీడీపీ, జనసేన నేతల అభివాదం


ఏలూరులో టీడీపీలో చేరిన ముస్లింలు


బాదంపూడిలో సమస్యలు తెలుసుకుంటున్న ధర్మరాజు


మహేష్ యాదవ్‌ను కలిసిన గణపవరం నేతలు

కలసి పనిచేద్దాం..

కూటమిని గెలిపిద్దాం

టీడీపీ, జనసేన నేతల పిలుపు

ఏలూరు టూటౌన్, మార్చి 26: కలసి పనిచేద్దాం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపిద్దాం, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దామని ఏలూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి, జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. జనసేన కార్యాలయంలో చంటి, అప్పలనాయుడు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ సమష్టిగా పని చేసి బడేటి చంటిని 50 వేల మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. జనసేన, టీడీపీ కార్యకర్తలు కలసి క్షేత్రస్థాయిలో పని చేస్తారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు జరిగిన అన్యాయంపై పోరాటం కొనసాగిస్తామన్నారు. కూటమిగా వైసీపీ దౌర్జన్యాలను ఎదుర్కొంటామన్నారు. అనంతరం చంటి మాట్లాడుతూ జనసేన, బీజేపీ నాయకులతో సత్సంబధాలు ఉన్నాయన్నారు. అప్పలనాయుడు, తాను ఎవరికి టిక్కెట్టు లభించిన కలసి పనిచేద్దామనే నిర్ణయానికి వచ్చామన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ త్వరలోనే అప్పలనాయుడుతో మాట్లాడి పార్టీ విజయానికి కృషి చేయాల్సినదిగా కోరతారన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు కూటమి ప్రభుత్వం నెరవేస్తుందన్నారు. కార్యక్రమంలో రాఘవయ్య చౌదరి, సిరిపల్లి ప్రసాద్, ఓ.శ్రావణ్‌కుమార్ గుప్తా, ఎన్.కాశీనరేష్, శివప్రసాద్, చోడే వెంకటరత్నం, రెడ్డి నాగరాజు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన ముస్లింలు

ముస్లింలు టీడీపీలోకి వలసలు వస్తున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. 8వ డివిజన్‌కు చెందిన ఆసిఫ్‌బేగ్ ఆధ్వర్యంలో షరీఫ్‌బాష అస్కర్ ఆలీ, షేక్ షబీర్, షేక్ సుభానితో పాటు వందలాది మంది ముస్లిం యువత టీడీపీలో చేరారు. బడేటి క్యాంపు కార్యాలయంలో వారికి పార్టీ కండువా కప్పి చంటి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో చోడే వెంకటరత్నం, శివప్రసాద్, మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు అబ్దుల్ జఫార్ మోజాయిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా బడేటి చంటి 23, 24 డివిజన్స్‌లో పర్యటించారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ 6పథకాలను వివరించారు.

రాష్ట్రంలో డ్రగ్‌మాఫియా తీసుకొచ్చి విద్యార్థుల జీవితాలను జగన్ నాశనం చేస్తున్నాడని అన్నారు. ప్రజలను మత్తులో ఉంచి ఓట్లు దండుకోవచ్చన్న ఉద్దేశంతో భారీగా మత్తు పదార్థాలు వైసీపీ ప్రభుత్వం దిగుమతి చేస్తుందన్నారు. ఎన్నికల్లో వైసీపీని ఘోరంగా ఓడించాలని పిలుపునిచ్చారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

ఉంగుటూరు: కూటమి ప్రభుత్వం ద్వారా అభివృద్ధి సాధ్యమని ఉంగుటూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బాదంపూడిలో జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలతో కలసి ధర్మరాజు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గన్ని గోపాలం, జామి రాంబాబు, వంకిన వెంకటేశ్వరరావు, పంది రాంబాబు తదితరులు పాల్గొన్నారు. దొంతవరంలో రంభ శేఖర్, సింగులూరి సుధీర్ ఆధ్వర్యంలో కాటి సుందరరావు, సూర్యచంద్రరావు, బొడ్డు రాజు, యాగం శ్రీను, తదితరులు జనసేనలో చేరారు. వారికి ధర్మరాజు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఎంపీ అభ్యర్థిని కలసిన గణపవరం టీడీపీ నేతలు

గణపవరం: వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు కలసికట్టుగా పని చేయాలని ఏలూరు ఎంపీ ఉమ్మడి అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ కోరారు. పిప్పరలో టీడీపీ నాయకులు ఆయనను కలిశారు. వైసీపీ మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలను చైతన్యం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఇందుకూరి రామకృష్ణంరాజు, అద్దేపల్లి వాసురాజు, సుబ్బారావు, కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, కాపారం చిన్న, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, జన సేన సమన్వయ భేటీ

జీలుగుమిల్లి: బీజేపీ టీడీపీ జనసేన పార్టీ సమన్వయంతో తనను గెలిపించాలని పోలవరం ఉమ్మడి అభ్యర్థి చిర్రి బాలరాజు అన్నారు. జీలుగుమిల్లిలో బీజేపీ, జనసేన ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. బీజేపీ టీడీపీ జనసేన పార్టీల సమన్వయ కృషితో విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ చాట్రాతి ప్రసాద్, మండల అధ్యక్షుడు కొండలపల్లి ప్రసాద్‌తో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు పసుపులేటి రాము చర్చించారు. ఆయా పార్టీ నాయకులు కోలా మధు, శాకమూరి సాయి, రూపా సత్యనారాయణ, దారా మధు, కక్కిరాల సునీల్, నూసా గెసాలం, కక్కిరాల రాము, పులగం సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో జన సేన సమావేశం

కొయ్యలగూడెం: జనసేన నాయకులంతా ఐక్యంగా పని చేయాలని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజు కోరారు. కొయ్యలగూడెంలో ఏర్పాటు చేసిన జనసేన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా తనకు అవకాశం దక్కిందని, విజయానికి అందరూ కలసికట్టుగా పనిచేయాలని కోరారు. జనసేన పార్టీ నాయకులంతా టీడీపీ, బీజేపీ నాయకులతో సమన్వయంతో కూటమి విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో దుగ్గిన శ్రీనివాస్, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు తోట రవి, దుగ్గిన శ్రీను, చోడిపిండి సుబ్రహ్మణ్యం, మేకల తేజ, ఏపూరి సతీష్, ఏడుకొండలు, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


కైకరం వద్ద జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి, పెదవేగి మండల వంగూరులో ఫ్లయింగ్ స్క్వాడ్, జీలుగుమిల్లి చెక్‌పోస్ట్ వద్ద డీఎస్పీ తనిఖీ

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : జేసీ

ఉంగుటూరు, మార్చి 26: ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి హెచ్చరించారు. కైకరం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జాయింట్ కలెక్టర్ సమక్షంలో అధికారులు, సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనల దృష్ట్యా రూ.50 వేలకు మించి నగదు దూరప్రాంతాలకు పట్టుకు వెళ్లరాదన్నారు. అంతకుమించితే సరైన ఆధారాలు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.వెంకట శివయ్య, డీటీ బొడ్డేపల్లి దుర్గా ప్రసాద్, ఏఎస్ఐ కడియాల సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు అనుసరించాలని మత్స్యశాఖ ఏడీ, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి నరసింహారావు అన్నారు. వంగూరు సమీపంలో జాతీయ రహదారిపై వాహన తనిఖీ నిర్వహించారు. పరిమితికి మించి నగదు తీసుకెళ్లకూడదన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తువులు, ఇతర సామగ్రి తరలించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలకు లోబడి నడచుకోవాలని, లేకుంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. తనిఖీ బృందంలో పెదవేగి ఏఎస్ఐ పీఎస్వీ.ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

● కామవరపుకోట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం, ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువుల రవాణా జరగకుండా తడికలపూడి పోలీసులు, రెవెన్యూ అధికారులు కొత్తూరు నాలుగు రోడ్ల కూడలి వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, చిన్నకార్లు, వ్యానులను సమగ్రంగా తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల అధికారి ఎస్‌డి.మొహిద్దీన్, జయబాబు మాట్లాడుతూ పత్రాలు లేకుండా రూ.50వేల కంటే ఎక్కువ నగదు తీసుకువెళితే సీజ్ చేస్తామన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఎటువంటి వస్తువులు తీసుకువెళ్లినా సీజ్ క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

● జీలుగుమిల్లి: చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సురేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. కామయ్యపాలెం, రాచన్నగూడెం, జీలుగుమిల్లి రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులను ఆయన పరిశీలించారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చెయ్యాలన్నారు. 24గంటల పాటు విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్ర సరిహద్దు నుంచి ఎటువంటి ఎన్నికల ప్రచార సామగ్రి తరలిపోకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు.

ప్రజా సమస్యలపై శ్రమించేవారు ఎమ్మెల్యే కావాలి

బుట్టాయగూడెం, మార్చి 26: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించే వాడే ఎమ్మెల్యే కావాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు ఎస్.రామ్మోహన్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న తరుణంలో అభ్యర్థుల కోసం ప్రజల్లో చర్చ ప్రారంభమైనట్లు తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన వ్యక్తి నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయవలసి ఉండగా దురదృష్టవశాత్తు ఎన్నికలు వ్యాపార సరుకుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాసులు వెనకేసుకోడానికే ఎమ్మెల్యే పదవిని ఆశిస్తున్నారనే అభిప్రాయం బలంగా ప్రజల్లో నాటుకు పోయిందన్నారు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో వెనుకబడిన ప్రజల అభివృద్ధి కోసం పనిచేసే వ్యక్తిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. పోలవరం నియోజకవర్గంలో వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నవారు అధికంగా ఉన్నారని, గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తికావడం లేదని, చింతలపూడి ఎత్తిపోతల పథకం అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఏడు మండలాల్లోని వ్యవసాయాధిరిత చెరువులు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారని మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉద్యోగులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, నిరుద్యోగ సమస్య వెంటాడుతుందని ప్రజా సమస్యలపై పోరాటాలు చేసేవారినే ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలన్నారు.

చేనేత కుటుంబం ఆత్మహత్యకు కారకులను శిక్షించాలి

ఏలూరు టూటౌన్, మార్చి 26: కడప జిల్లా మాధవరానికి చెందిన చేనేత కార్మికుడు బాల సుబ్బారావు కుటుంబం ఆత్మహత్యకు కారకులైన రెవెన్యూ అధికారులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.కన్నయ్య డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం కన్నయ్య మాట్లాడుతూ సుబ్బారావు పొలాన్ని వైసీపీ నాయకులు తప్పుడు ధ్రువపత్రాలతో స్వాధీనం చేసుకోవడాన్ని భరించలేక సుబ్బారావుతో పాటు భార్య, కుమార్తెలు ఆత్మహత్యకు పాల్పడ్డారని అన్నారు. వైసీపీ నాయకులు, రెవెన్యూ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి శిక్షించాలన్నారు. కుటుంబం ఆత్మహత్యకు పాల్పడ్డ కుటుంబంలో ఒక్కొక్కరికి రూ.50 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు.

నెక్లెస్ బండ్‌పై ఆక్రమణలు తొలగించాలి

పోలవరం, మార్చి 26: గోదావరి నదీ తీరం వెంబడి గ్రామానికి వరదల నుంచి రక్షణగా నిర్మించిన నెక్లెస్ బండ్ ఆక్రమణల చెరలో చిక్కుకుందని గ్రామ పంచాయతీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. నెక్లెస్ బండ్‌కు మేజర్ డ్రైనేజీ నిర్మించి ఆక్రమణలు తొలగించాలని వారు డిమాండ్ చేశారు. పంచాయతీ సభ్యులు మంగిన పోశీరత్నం, మేడూరి పార్వతి, పట్నాల దేవి మంగళవారం మాట్లాడుతూ నెక్లెస్ బండ్ పొడవునా మేజర్ డ్రైనేజీ నిర్మించకపోవడంతో వలన వర్షాల సీజనులో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నెక్లెస్ బండ్ పొడవునా ఆక్రమణలు తొలగించి మేజర్ డ్రైనేజీ నిర్మించాలని కోరారు. పాత పోలవరం నుంచి యడ్లగూడెం వరకూ మూడున్నర కిలోమీటర్ల మేర నెక్లెస్ బండ్ నిర్మాణం కోసం జల వనరుల శాఖ అధికారులు రూ.1.5 కోట్లతో భూములు కొనుగోలు చేసి నెక్లెస్ బండ్ నిర్మించారని, పూర్తిస్థాయిలో పనులు చేయకపోవడంతో వరదల సమయంలో ప్రజలు వరద భయంతో బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని జీవించాల్సి వస్తుందన్నారు. దీనికితోడు నెక్లెస్ బండ్ పొడవునా కొందరు ఆక్రమణలు చేసి తడికలు, బరకాలు కట్టి మొక్కల పెంపకం ఇతర కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని, దీని వలన నెక్లెస్ బండ్‌కు రక్షణ లేకుండా పోతుందన్నారు. ఆక్రమణలు తొలగించి పునరు ద్ధరణ చర్యలు చేపట్టాలని, మేజర్ డ్రైనేజీ నిర్మించాలని వారు కోరారు.

విలీన గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఏలూరు టూటౌన్, మార్చి 26: నగరంలో విలీనమైన ఏడు గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. జీవరత్నం అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడు గ్రామాల్లో ఉపాధి పథకాన్ని రద్దు చేశారన్నారు. పనులు లేక వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఉపాధ్యక్షుడు రవి, మహంకాళిరావు, పాల్గొన్నారు.


ఏలూరులో ఇండియా కూటమి ప్రతినిధుల సంఘీభావం


కుక్కునూరు మండలంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలి

ఏలూరు కార్పొరేషన్, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఆమ్ ఆద్మీ, భారత్ బచావో తదితర పార్టీల నేతలు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఆయా పార్టీల నేతలు సమావేశమయ్యారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు, ఉంగుటూరు ఇన్‌చార్జి హరికుమార్, సీపీఎం కార్యదర్శి పి.కిషోర్, సీపీఐ సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, భారత్ బచావో జిల్లా అధ్యక్షుడు గుబ్బల నాగేశ్వరరావు, ఆమ్‌ఆద్మీ పార్టీ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలీ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం హిందువులు, ముస్లింల మధ్య విభేదాలు పెట్టి మత చిచ్చును రేపుతుందని విమర్శించారు. దేశ, రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా అన్ని వర్గాల ప్రజలు ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని వారు కోరారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికి పదేళ్లపాటు ప్రత్యేక హోదా ఇస్తానని హామీని బీజేపీ అమలు చేయలేదన్నారు. విశాఖ రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదన్నారు. కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, కత్రావు, కేఎస్ఎన్.మూర్తి, రాయల సతీష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. కుక్కునూరు మండలం జిన్నెలగూడెం, రెడ్డిగూడెం తదితర గ్రామాల్లో పార్టీ నాయకులతో కలసి పర్యటించారు. గ్రామాల్లో సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం పార్టీ పోలవరం నియోజకవర్గం అభ్యర్థి కారం దారయ్య అధ్యక్షతన కుక్కునూరులో సమావేశం జరిగింది. ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వం, మానవత్వాన్ని మంట కలుపుతున్న బీజేపీని, ఆ పార్టీని బలపరుస్తున్న కూటమిని చిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు పూనుకోవడం దారుణమన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని విస్మరించిందన్నారు. ఇండియా కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. పోలవరంలో పోటీకి సీపీఐ సంసిద్ధత వ్యక్తం చేయడంతో భాగస్వామ్య పార్టీలు కూడా మద్దతు ప్రకటించాయన్నారు. సీపీఐ అభ్యర్థి కారం దారయ్య పార్టీ శ్రేణులతో కలసి పర్యటిస్తున్నారని కృష్ణ చైతన్య తెలిపారు. ఎం.వెంకటాచారి, సన్నేపల్లి సాయిబాబా, జంపన వెంకటరమణ రాజు, కారం దారయ్య కొన్నె లక్ష్మయ్య, వరకా శ్యామల, కూరాకుల బాబు రావు, తదితరులు పాల్గొన్నారు.

నారా భువనేశ్వరిని కలసిన చిర్రి బాలరాజు


భువనేశ్వరికి పుష్పగుచ్ఛం ఇస్తున్న బాలరాజు

కొయ్యలగూడెం, మార్చి 26: కొయ్యలగూడెం మండల పర్యటనకు వచ్చిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని పోలవరం జనసేన పార్టీ అభ్యర్థి చిర్రి బాలరాజు మంగళవారం కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చారు. పలువురు నాయకులు కూడా ఉన్నారు.

కూటమి డిక్లరేషన్‌లో బీసీలకు ప్రాధాన్యం


రేచర్లలో బీసీ నాయకుల ప్రదర్శన

చింతలపూడి, మార్చి 26: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు రాజకీయ, ఆర్థిక ప్రాధాన్యం ఇచ్చారని టీడీపీ వాణిజ్య రాష్ట్ర విభాగం అధ్యక్షుడు కొమరరాజు సత్యనారాయణ అన్నారు. చింతలపూడి మండలం రేచర్ల బీసీ కాలనీలో డిక్లరేషన్ అంశాలను కాలనీ వాసులకు వివరించారు. చంద్రబాబు హయాంలో బీసీలకు స్థానిక సంస్థల్లో 34శాతం రిజర్వేషన్ కల్పించారని, ఆదరణ పథకంలో చేతివృత్తిదారులకు పనిముట్లు అందజేశారని, జగన్ హయాంలో బీసీ కులాల మధ్య చిచ్చుపెట్టి కార్పొరేషన్ ఏర్పాటుచేసి నిధులు ఇవ్వలేదన్నారు. టీడీపీ నాయకులు పుసునూరి సుబ్బారావు, కె.వెంకటేశ్వరరావు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు సహకరించాలి


వెంకట్రాజుతో ఎమ్మార్పీఎస్ నేతలు

కామవరపుకోట, మార్చి 26: టీడీపీ గోపాలపురం నియోజకవర్గ నాయకులు మద్దిపాటి వెంకట్రాజు మంగళవారం పాదయాత్రగా ద్వారకా తిరుమల చేరుకున్నారు. కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడెంకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు బారతాల రమేష్ మాదిగ, దర్శనం ఏసుబాబు, రవి, లక్ష్మణరావు, మహాలక్ష్మి, నాగరాజు, వెంకట్రాజు ఆయనను కలుసుకున్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు సహకరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మాదిగల తరపున వర్గీకరణపై మాట్లాడాలని కోరగా వెంకట్రాజు వారికి హామీ ఇచ్చారు.

ద్విచక్ర వాహనంపై ఫిర్యాదుల పెట్టెతో ప్రచారం


ఫిర్యాదుల పెట్టెతో యాత్ర చేస్తున్న బాలాజీ

జంగారెడ్డిగూడెం, మార్చి 26: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతు ఇవ్వండి, జయహో బీసీ అంటూ టీడీపీ అభిమాని ద్విచక్రవాహనంపై ఫిర్యాదుల పెట్టెతో పర్యటిస్తున్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గానికి చెందిన ప్రత్తిపాటి నాగబాలాజీ తెలిపారు. జంగారెడ్డిగూడెంలో నారా భువనేశ్వరి పర్యటనలో మంగళవారం బాలాజీ పాల్గొన్నారు. మార్చి 1న నాగార్జున సాగర్ నుంచి ఇచ్ఛాపురం వరకు ద్విచక్ర వాహనంపై 4వేల కిలోమీటర్ల యాత్ర చేస్తున్నానని, పిర్యాదుల పెట్టెలో వచ్చిన ఫిర్యాదులను కూటమి దృష్టికి తీసుకువెళతానని చెప్పాడు. స్థానిక టీడీపీ, జనసేన నాయకులను కలిశారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** అగ్రహారంలోని జనార్దనస్వామి తిరు కల్యాణ ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ముగింపు సందర్భంగా భక్తులు సామూహికంగా జనార్దన సుప్రభాత గోష్ఠి నిర్వహించారు. స్వామివార్లకు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కొడవంటిగంటి వెంకట రాజన్, అర్చకులు వంగల పవనకుమారాచార్యులు, వెంకటాచార్యులు పవళింపు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.
- తంగెళ్ళమూడిలోని పునర్నిర్మితమైన ఆలయం వద్ద బుధవారం ఉదయం రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ, అనంతరం శాంతి కల్యాణ మహోత్సవం, మహా అన్నసమారాధన జరుగుతాయని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు, మహా శాంతి హోమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
- **కామవరపుకోట :** సాగిపాడు పంచాయతీ రత్నగిరినగర్‌లో రత్నతులసిదేవి ఆలయం వద్ద ఈనెల 18 నుంచి 24 వరకు ఉత్సవాలు జరిగిన నేపథ్యంలో భక్తులకు మహా అన్నసమారాధనను ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు.
- **పెదపాడు :** అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ ఇవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్వామివారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ పాలకమండలి సభ్యులు, దేవాలయ ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.
- **టి.నరసాపురం :** పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు తెలిపారు. టి.నరసాపురంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సిబ్బందితో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.4080 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


పెయ్యేరు పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్వో భాస్కర్

బూత్‌లలో అవసరాలు గుర్తించండి: ఆర్వో

ముదినేపల్లి, మార్చి 26 : పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భాస్కర్ తెలిపారు. ముదినేపల్లి, పెయ్యేరు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను మంగళవారం ఆయన తహసీల్దార్ కుమారి, మండల పరిషత్ ఏవో రమణబాబుతో కలసి పరిశీలించారు. బూత్‌ల వద్ద ఎన్నికల సిబ్బందితోపాటు ఓటర్లకు కూడా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలన్నారు. ముందుగా అవసరాలను గుర్తించి నివేదిక రూపొందించాలన్నారు. అనంతరం పామర్రు - దిగమర్రు జాతీయ రహదారిలో ఏలూరు జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఆయన పరిశీలించి వాహన తనిఖీల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.


కైకలూరులో భవానమ్మ చెరువును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ

మంచినీటి చెరువుల పరిశీలన

బోదె నిర్వహణలో అలసత్వంపై ఎస్ఈ ఆగ్రహం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కైకలూరు, మార్చి 26: గ్రామాల్లో తాగునీటి సరఫరాను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. 'కైకలూరు గెంతెండుతోంది..' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి కైకలూరు మండలంలోని మంచినీటి చెరువులను పరిశీలించారు. ప్రధానంగా కైకలూరు భవానమ్మ చెరువు వద్ద ఉన్న ర్యాపిడ్ సాండ్ ఫిల్టర్‌ను, ఆర్వో ప్లాంట్‌ను వినియోగంలోకి తేవాలని సూచించారు. రాజీవ్ జలాశయంలో నీరు అడుగంటడంతో పక్కనే ఉన్న పెద్ద చెరువులో నీటిని ప్రజలకు సరఫరా చేయాలన్నారు. అలాగే ప్రజలు ఈ నీటిని కాచి చల్లార్చి తాగునీటి అవసరాలు తీర్చుకునేలా గ్రామాల్లో దండోరా వేయాలన్నారు. అలాగే కైకలూరు మంచినీటి చెరువుకు వెళ్లే పంటబోదె అధ్వాన స్థితిని చూసిన ఎస్ఈ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీరు సరఫరా చేసే బోదె ఇంత అధ్వానంగా ఉండడం ఎక్కడా చూడలేదని, తక్షణమే పంట బోదెను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అటపాక మంచినీటి చెరువులో నీరు తక్కువగా ఉన్నందున రోజు విడిచి రోజు నీరు విడుదల చేయాలని సూచించారు. అలాగే భుజబలపట్నం, పల్లెవాడ, ఆలపాడు, దొడ్డిపట్ల సీతనపల్లి గ్రామాల్లోని మంచినీటి చెరువులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే ఏప్రిల్ మొదటి వారంలో కాలువలకు నీరు విడుదల చేస్తామని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారని అప్పటికి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేసి మంచినీటి చెరువులు నింపుకునేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డీ ఆర్. రవిశంకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బి. నాగబాబు, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వరరావు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్‌ల దొంగలకు రిమాండ్

చాట్రాయి, మార్చి 26: బైక్‌లు, ఆలయాల్లో హుండీ సొమ్ము తస్కరిస్తూ తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్సై కేసీహెచ్ స్వామి వివరాల ప్రకారం ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం ఓబులాపురానికి చెందిన గొలుసు ఏసుబాబు అలియాస్ మానికల ఏసుబాబు, చాట్రాయి మండలం కోటపాడుకు చెందిన చెవురి ఆదినారాయణ ముఠాగా ఏర్పడి పలు చోరీలకు పాల్పడగా వీరిపై 8 కేసులు నమోదయ్యాయి. సీ గుడిపాడు ఆలయంలో హుండీ పగలగొట్టి నగదు చోరీచేసినట్టు వీరిపై అభియోగం ఉంది. వీరి నుంచి 8 బైక్‌లు స్వాధీనం చేసుకొని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి డిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.


20 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి, మార్చి 26: మండలంలోని పర్వతాపురంలో ఓ వ్యక్తి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు చాట్రాయి పోలీసులు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒకరి అరెస్టు

ముసునూరు, మార్చి 26: అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్న వ్యక్తిపై సోమవారం రాత్రి ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. చింతలవల్లి గ్రామానికి చెంది వీరంకి శ్రీనివాసరావు ప్రభుత్వ మద్యం దుకాణంలో ఎక్కువ మద్యం సీసాలను తీసుకువచ్చి ఇంటివద్ద అధిక రేట్లకు అక్రమంగా విక్రయిస్తుండగా దాడిచేసినట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు. ఈ దాడిలో ముద్దాయి శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని, అతని నుంచి రూ. 750 విలువగల ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ముద్దాయి శ్రీనివాసరావును మంగళవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వాసు తెలిపారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



నూజివీడు టౌన్, మార్చి 26: నూజివీడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో పట్టుకున్న సారా, అనధికార మద్యాన్ని మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె.రామకృష్ణ సమక్షంలో ధ్వంసం చేశారు. ఫిబ్రవరి నుంచి మార్చి 26వ తేదీ వరకు స్వాధీనం చేసుకున్న 283 లీటర్ల సారాతో పాటు 572 మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు నూజివీడు సెబ్ సీఐ పి.వెంకటరమణ తెలిపారు.


చాట్రాయి నుంచి రవాణా అవుతున్న మొక్కజొన్న బొండ్లు

బొండులకు భలే గిరాకీ!

చాట్రాయి, మార్చి 26: పనికిరాని మొక్కజొన్న బొండులకు గిరాకీ పెరిగింది. మొక్కజొన్న కండెల నుంచి మిషన్‌తో గింజలు వేరుచేసిన తరువాత వచ్చిన బొండులను గతంలో ఎక్కడికక్కడ పనికిరాని చెత్తగా వదిలేసేవారు. అవి వర్షాలకు కుళ్ళి భూమిలో కలిసిపోయేవి. అయితే ఇప్పుడు అవి కూడా ఆదాయ వనరుగా మారాయి. విజయరాయి ప్రాంతం నుంచి వ్యాపారులు వచ్చి ఎకరాలు లెక్కన రైతుల నుంచి కొనుగోలు చేసి ట్రాక్టర్లపై లోడ్ చేసి రవాణా చేస్తున్నారు. బాయిలర్లలో మండించటానికి, ఇటుక బట్టీలకు బొండులు వాడుతున్నట్టు చెబుతున్నారు. గతంలో పైసా ఆదాయం రాని బొండులకు ఇప్పుడు గిరాకీ రావటంతో రైతులు వాటిని జాగ్రత్త చేసి వ్యాపారులకు అమ్ముతున్నారు.



ముదినేపల్లిలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్.. బస్సులో తనిఖీ చేస్తున్న ముదినేపల్లి తహసీల్దార్ కుమారి, ఏఓ రమణ బాబు


వలసపల్లి వద్ద కారును తనిఖీ చేస్తున్న ఎస్ఐ వాసు

తనిఖీలు ముమ్మరం

ఆర్టీసీ బస్సులోనూ తనిఖీలు చేసిన అధికారులు


కృష్ణారావుపాలెం చెక్‌పోస్టు వద్ద పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న నూజివీడు ఆర్డీవో భవానీ శంకరి

ముదినేపల్లి, మార్చి 26 : ఎన్నికల నిఘా ముమ్మరమైంది. నోటిఫికేషన్ విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ చట్ట విరుద్ధమైన కార్యక్రమాలను అరికట్టేందుకు అధికార బృందాలు రంగంలోకి దిగారు. సెక్టార్ అధికారులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కమిటీలు, ఫ్లయింగ్ స్క్వాడ్, వాహనాల తనిఖీలకు ఏర్పాటైన స్టాటిక్ సర్వే టీంలు ముమ్మరంగా నిఘా నిర్వహిస్తున్నాయి. ముదినేపల్లి మండలంలోని పోలింగ్ స్టేషన్లను ఆరు సెక్టార్లుగా విభజించి 24 మందిని టీంలుగా ఏర్పాటు చేశారు. ఈ టీంలు పోలింగ్ బూత్‌ల వద్ద ఎన్నికల ఏర్పాట్లు, సదుపాయాల కల్పన సిబ్బందికి వసతి, బూత్‌ల రక్షణ తదితర అంశాలపై ఆరా తీస్తున్నాయి. ఫ్లయింగ్ స్క్వాడ్లు కూడా రంగంలోకి దిగాయి. డ్రైనేజీ ఏఈలు కుమార్, భోగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలోని ఈ స్క్వాడ్‌లు బెల్టుషాపుల నిర్వహణను అరికడతాయి. సీవిజిల్ యాప్‌ల ద్వారా అందే ఫిర్యాదులపై విచారించి చర్యలు తీసుకుంటారు. మండలంలో ఇప్పటివరకు సీవిజిల్ యాప్ ద్వారా ఐదు ఫిర్యాదులు రాగా, వాహనాలకు ఉన్న వైసీపీ జెండాలను తొలగించారు. తహసీల్దార్, ఎంపీడీవో ఆధ్వర్యంలో ఎన్నికల కోడ్ అమలు కమిటీ కూడా మండలంలో విస్తృతంగా పర్యటిస్తున్నది. మంగళవారం ముదినేపల్లిలో ఫ్లయింగ్ స్క్వాడ్ వాహన తనిఖీలు చేపట్టింది.

ఆర్టీసీ బస్సులో తనిఖీలు..

అధికారులు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించటం మొదలైంది. ప్రైవేట్ వాహనాలతోపాటు ఆర్టీసీ బస్సులను కూడా ఎన్నికల అధికారులు తనిఖీలు చేస్తున్నారు. మంగళవారం ముదినేపల్లి తహసీల్దార్ ఎస్.లక్ష్మీ నరస కుమారి, మండల పరిషత్ ఏఓ రమణబాబు, విజయవాడ - భీమవరం ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్‌లో ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేశారు. సొమ్ము, ఇతర మాదక ద్రవ్యాల రవాణాను గుర్తించేందుకు ఆర్టీసీ బస్సులను తనిఖీ చేయాల్సిన అవసరం ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు.

ముసునూరు మండలంలో...

ముసునూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎస్ఐ పి.వాసు ఆధ్వర్యంలో మంగళవారం వలసపల్లి, ముసునూరు శివారు నేలపాటివారి కుంట, చెక్కపల్లి తదితర గ్రామాల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఓటర్లను ప్రభావితం చేసేందుకు అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువులను తరలిస్తే వాహనాలను సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ చేసిన ఆర్డీవో

చాట్రాయి, మార్చి 26: తెలంగాణ సరిహద్దు కృష్ణారావుపాలెం వద్ద ఉన్న ఎన్నికల చెక్‌పోస్టును మంగళవారం సాయంత్రం నూజివీడు ఆర్డీవో భవానీ శంకరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం నగదు, మద్యం మొదలైనవి మన రాష్ట్రంలోకి అక్రమంగా రాకుండా నిరంతరం పహరా కాయాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని నిర్లక్ష్యం వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాల తనిఖీని పరిశీలించారు. ఆమె వెంట నూజివీడు రూరల్ సీఐ లక్ష్మయ్య, తహసీల్దార్ మహ్మద్ మక్సూద్ అలీ, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అనధికార మద్యం రవాణా నియంత్రణకు..

ఉమ్మడి దాడులు

నూజివీడు, మార్చి 26: ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ, ఏపీ సరిహద్దుల్లో ఉమ్మడి దాడులకు చర్యలు తీసుకోవాలని ఖమ్మం, ఏలూరు జిల్లాల అధికారులు నిర్ణయించారు. నూజివీడు సారథి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఇరు రాష్ట్రాలకు సంబంధించి అనధికార మద్యం నియంత్రణపై ఇంటర్ స్టేట్ కో-ఆర్డినేషన్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సమావేశంలో ఏలూరు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె.రామకృష్ణ, అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, ఖమ్మం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.నాగేంద్రరెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎన్.వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా సరిహద్దులోని తెలంగాణ రాష్ట్ర ప్రాంతాల్లో అధికారిక బెల్టుషాపులు ఉండటంతో ఏలూరు జిల్లాలో అనధికారికంగా మద్యం రవాణాను అరికట్టడంలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. నేరుగా షాపుల నుంచి లిక్కర్ కొనకుండా బెల్టుషాపులో లిక్కర్ కొనుగోలు చేస్తున్న రవాణాదారులు మద్యాన్ని సరిహద్దులు దాటిస్తున్నారని ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాల అధికారులు ఉమ్మడిగా దాడులు చేయాల్సిన అవసరం ఉందని నిర్ణయించారు. అదేవిధంగా రాష్ట్రంలోకి తెలంగాణ, యానాం, గోవా నుంచి మద్యం రవాణా అవుతోందని, ప్రధానంగా గుడ్లు, చేపలు తదితర రవాణా లారీలలో రహస్యంగా ఉంచిన ర్యాక్‌లో ఈ మద్యం ఉంచి రవాణా చేస్తుండటంతో వాటిని పట్టుకోవడం కష్టంగా ఉందని, ఈ పరిస్థితిని నివారించేందుకు ప్రత్యేక నిఘాను కొనసాగిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. సత్తుపల్లి ఎక్సైజ్ సీఐ సి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నూజివీడు సెబ్ సీఐ రమణ, ఎస్సై కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కో-ఆర్డినేషన్ సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు


పార్టీ సీనియర్ నాయకుడు శ్యామలరావును సన్మానిస్తున్న పార్థసారథి

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి

ముసునూరు, మార్చి 26: టీడీపీ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం రాత్రి కాట్రేనిపాడులో జరిగిన టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళ వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ఆర్థిక సంఘాల నిధులను సైతం పక్కదారి పట్టించి, గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకుండా ఈ ప్రభుత్వం చేసిందన్నారు. ఆర్థిక సంఘాల నిధుల కోసం రాజకీయాలకతీతంగా సర్పంచ్‌లు ఉద్యమించడం, ఈ ప్రభుత్వ అసమర్థ పాలనలకు నిదర్శనమన్నారు. నూజివీడు కూటమి అభ్యర్థిగా తనను గెలిపిస్తే, నియోజకర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతానని హామీ ఇచ్చారు. అనంతరం టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి, గ్రామాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న సీనియర్ టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ బొమ్మగంటి శ్యామలరావును పార్థసారథి సన్మానించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు మొక్కపాటి వెంకట రామారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూజివీడులో 'మన ఇంటికి మన సారథి'

నూజివీడు: నూజివీడు పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ, 16వ వార్డులో నూజివీడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో మన ఇంటికి మన సారథి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో సమస్యలు తెలుసుకుంటూ టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ఆయన ముందుకు సాగారు. మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, కౌన్సిలర్ కె. విజయ, మాజీ కౌన్సిలర్ జి. దుర్గాదేవి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అరికోటి సంగీతరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ముసునూరు, మార్చి 26: కాట్రేనిపాడుకు చెందిన టీడీపీ నాయకుడు వీరయ్య కుటుంబాన్ని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి మంగళవారం పరామర్శించారు. ఇటీవల వీరయ్య కుమార్తె భవాని పాముకాటుకు గురై చికిత్స పొందుతూ మృతి చెందింది. భవాని తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు మొక్కపాటి వెంకట రామారావు, నాయకులు గద్దల మోహన్‌రావు, రాపర్ల ప్రతాప్, సూర్యదేవర శ్రీనివాసరావు, రాపర్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఆక్రమించిన భూమికి హద్దులుగా ముగ్గువేసిన దృశ్యం

అధికారుల అండతో ఆక్రమణలు?

కోర్టు నోటీసులు ఇచ్చినా బేఖాతర్

ఆగిరిపల్లి, మార్చి 26: ఆగిరిపల్లి మండలం సింగన్నగూడెం సాయిబాబా గుడి ఎదురుగా నూజివీడు - విజయవాడ ప్రధాన రహదారి పక్కన ఉన్న విలువైన రోడ్డు పోరంబోకు భూమిని విలేకర్ల ముసుగులో కొందరు రెవెన్యూ అధికారుల అండతో ఆక్రమించుకోవటానికి యత్నించగా భూ యజమానులు కోర్టును ఆశ్రయించారు. ఆర్‌అండ్‌బీ రహదారి సరిహద్దు గల భూ యజమానులు ఈ ఆక్రమణపై ఇటీవల హైకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు నుంచి అధికారులకు నోటీసులు అందాయి. అయినా ఆక్రమణదారులు కోర్టు ఆదేశాలను లెక్కచేయకుండా తాజాగా భూమిని చదునుచేసి మెరక తోలి ఆదివారం భూసర్వే నిర్వహించి ప్లాట్లుగా విడగొట్టారు. మంగళవారం పక్కా నిర్మాణాలకు ప్లాన్ సిద్ధం చేసినా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానిక ప్రజలు, రాజకీయ నాయకులు నిరసన తెలిపారు.

తహసీల్దార్ వివరణ

ప్రభుత్వ భూములు ఆక్రమించే వారిపై చర్యలు తీసుకుంటామని, భూమిలో వేసిన ప్లాన్‌లను తొలగిస్తామని తహసీల్దార్ డి.మృత్యుంజయరావు తెలిపారు.

చిన్నం రామకోటయ్య వైసీపీలో చేరిక

నూజివీడు, మార్చి 26: నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య మంగళవారం వైసీపీలో చేరారు. జనవరి నెల నుంచి రామకోటయ్య నూజివీడు నియోజకవర్గంలో హల్‌చల్ చేస్తూ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించి చాట్రాయిలో భారీ బహిరంగ సభ కూడా జరిపారు. మంగళవారం అనూహ్యంగా వైసీపీలో చేరారు.

ఓటమికి పార్టీ నాయకులే కారణం : ముద్దరబోయిన

నూజివీడు టౌన్, మార్చి 26: టీడీపీ నాయకుల తీరువల్లే నూజివీడులో ఆ పార్టీ ఓటమి పాలైందని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. జంగంగూడెంలో ముద్దరబోయిన అభిమానుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 నుంచి నూజివీడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఓటమికి ఆ పార్టీ నాయకులే కారణమన్నారు. నూజివీడు నియోజకవర్గంలో కార్యకర్తల అండదండలతో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా సైన్స్ పరీక్ష

ముదినేపల్లి, మార్చి 26: పదవ తరగతి పరీక్షలు ముగింపు దశకు చేరుకున్నాయి. ముదినేపల్లి మండలంలో మంగళవారం జరిగిన నాచురల్ సైన్స్ పరీక్షకు 104 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలో 823 మంది విద్యార్థులు ఎస్ఎస్ పరీక్ష రాయాల్సి ఉండగా, 719 మంది హాజరయ్యారు. పెదగొన్నూరు జడ్పీ హైస్కూల్‌లో 44 మంది, ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏడుగురు, హైస్కూల్‌లో నలుగురు, సహాయ మాత హైస్కూల్‌లో 47 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లు విజయ కుమార్, ఎస్.రామోజీ, జి.కృష్ణ మోహన్, కె.ఉదయ భాస్కర్ పర్యవేక్షణలో పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి.

ఆగిరిపల్లి: మంగళవారం టెన్త్ సైన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్‌లో రెగ్యులర్ విద్యార్థులు 210 మందికి 207 మంది, ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో 174 మంది విద్యార్థులకు 173 మంది, ఎస్వీ పబ్లిక్ స్కూల్‌లో 210 మంది విద్యార్థులకు 208 మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంఈవో సర్వేశ్వరరావు తెలిపారు.

ముసునూరు: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం జరిగిన సైన్స్ పరీక్షకు 61 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ముసునూరు జడ్పీ పాఠశాల పరీక్షా కేంద్రంలో 226 మందికి 215 మంది, చెక్కపల్లిలో 290 మందికి 259 మంది హాజరయ్యారు. గోపవరంలో 189 మందికి 170 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ జవహర్ బాజి తనిఖీ చేశారు. ఎస్ఐ పి.వాసు అధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

నూజివీడు డివిజన్‌లో 327 మంది గైర్హాజరు

నూజివీడు టౌన్, మార్చి 26: 10వ తరగతి పరీక్షల్లో మంగళవారం 327 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్టు నూజివీడు డీవైఈవో సేవ్యా తెలిపారు. నూజివీడు డివిజన్ పరిధిలోని ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి, నూజివీడు మండలాల్లో మొత్తం 17 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేయగా, ఎస్ఎస్ పరీక్షను 3,892 మంది రాయవలసి ఉండగా, 3565 మంది హాజరయ్యారని, 327 మంది గైర్హాజరైనట్టు ఆయన తెలిపారు.


ముదినేపల్లి హైస్కూల్‌లో పరీక్షకు హాజరైన విద్యార్థులు

చాట్రాయి: చాట్రాయిలో మంగళవారం జరిగిన టెన్త్ పరీక్షలకు 48 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎంఈవో బ్రహ్మచారి తెలిపారు. జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 244 మందికి గాను 217 మంది, ఆర్సీఎం స్కూల్ పరీక్షా కేంద్రంలో 179 మందికి గాను 158 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈవో వివరించారు.

కలిదిండి: మండలంలో పది పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం సైన్స్ పరీక్షకు 1211 మందికి 1093 మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంఈవో ప్రభాకర్ బాబు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎస్ఐ ప్రియకుమార్ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

ఐజీ, ఎస్పీలకు పతకాలు


ఐజీ అశోక్‌కుమార్


ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, మార్చి 26 : శాంతి భద్రతలు కాపాడడంలో, కేసుల దర్యాప్తు, పరిపాలనా పరమైన అంశాలపై పరిశీలన జరిపి రాష్ట్రస్థాయిలో ఐపీఎస్ అధికారులకు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బందికి రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి అవార్డులను ప్రకటించారు.ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌కు రాష్ట్రస్థాయిలో గోల్డ్ విభాగంలో ఎంపికై అవార్డు పొందారు. ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి సిల్వర్ విభాగంలో ఎంపికయ్యారు. ఐపీఎస్ అధికారి అశోక్‌కుమార్ ఏలూరు రేంజ్ డీఐజీగా 2023 ఏప్రిల్ 12వ తేదీన బాధ్యతలు చేపట్టి ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఏలూరు రేంజ్ ఐజీగా విధులను నిర్వర్తిస్తున్నారు. రేంజ్ పరిధిలో ఏ సంఘటన జరిగినా స్వయంగా పరిశీలించి కేసుల దర్యాప్తు వేగవంతం చేశారు. మేరీ ప్రశాంతి 2023 ఏప్రిల్ 12న జిల్లా ఎస్పీగా ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. జిల్లాలో శాంతి భద్రతలు కాపాడడంలో మేరీ ప్రశాంతి ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు చేపట్టారు. స్పందన కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టారు. గతంలో ఏలూరు దిశ డీఎస్పీగా పనిచేసిన కేవీ సత్యనారాయణకు, డీసీఆర్బీ ఏఎస్ఐ రమేష్‌బాబు, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ వెంకట సత్యనారాయణ, ఏలూరు సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు, బుట్టాయిగూడెం కానిస్టేబుల్ బాలకృష్ణ, ఏలూరు జిల్లా కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ (పిసి 991), కాని స్టేబుల్ బాలకృష్ణ (పీసీ 2136), ఏలూరు దిశ పోలీస్‌స్టేషన్ మహిళా హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణ (డబ్ల్యుహెచ్‌సి 367)లకు బ్రాంజ్ మెడల్ ప్రకటించారు.

శోభనాచలస్వామి ఆలయ ఈవోగా సురేష్‌బాబు



ఆగిరిపల్లి, మార్చి 26: ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఈవోగా సురేష్‌బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆలయ, స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. ఆలయం పూర్తిగా దాతల సహకారంతో నడుస్తోందని, పూజారులకు పెండింగ్ జీతాలు త్వరలోనే చెల్లిస్తామని తెలిపారు. కొంతకాలం క్రితం వరాహ పుష్కరిణి అభివృద్ధి నిమిత్తం నెక్కలం గొల్లగూడెం గ్రామంలో ఉన్న చుక్కపల్లి కుశలవ కంపెనీ అధినేతలు ఇస్తామన్న రూ.7 లక్షలు కూడా సమకూర్చి మెట్లకోనేరు చుట్టూ కంచె వేయిస్తామని తెలిపారు. ఆలయం పక్కన ప్రముఖ వ్యాపారవేత్త రామనాగ లక్ష్మీ నారాయణరావు సహకారంతో నిర్మించిన కల్యాణ మండపం ప్రజలకు అందుబాటులోకి రావడం లేదని తెలుసుకుని త్వరలోనే అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఆలయ ధ్వజస్తంభం సగానికి పైగా పాడైపోవడం వల్ల జీర్ణోద్ధరణ పనులు జరుగుతున్నాయన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాట్రాయి, మార్చి 26: 132 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతులు కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండలంలో సోమవరం, తుమ్మగూడెం సబ్ స్టేషన్లు పరిధి తప్ప మిగతా గ్రామాల్లో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ సంజయ్ తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

వేద పాఠశాలకు రూ. 1.50 లక్షల వితరణ


చెక్కును అందుకుంటున్న కార్యదర్శి శర్మ

ఆగిరిపల్లి, మార్చి 26: ఆగిరిపల్లి శోభనాచల లక్ష్మీనరసింహ వేద పాఠశాల అభివృద్ధి, నిర్వహణ నిమిత్తం మంగళవారం దాత విరాళం అందజేశారు. ఏలూరుకు చెందిన గుండా సుందరశోభనా శాస్త్రి, సుశీల దంపతుల స్మృత్యర్థం వారి అల్లుడు, ఖమ్మం వాసి జొన్నలగడ్డ వెంకట పిచ్చియ్య శాస్త్రి రూ. లక్షా 50 వేల చెక్కును పాఠశాల కార్యదర్శి సూరిశర్మకు అందించారు. వారికి కార్యదర్శి కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవాలు



కలిదిండి, మార్చి 26 : సానారుద్రవరంలో బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవాలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భారీ అన్నసమారాధన జరిగింది. మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు జోగిరాజు, సొసైటీ చైర్మన్ పార్థసారథి, నున్న కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవాలు

భారీ అన్నసమారాధన



కైకలూరు, మార్చి 26: వరహాపట్నం శ్రీ లక్ష్మీనృసింహ స్వామి వార్షిక కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం అఖండ అన్న సమారాధన ను నిర్వహించారు. గ్రామంలో కల్యాణ మహోత్సవాల్లో స్వామివారికి ప్రతి రోజూ విశేష పూజలను నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, ఆలయ ఈవో వీఎన్‌కె శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు.